ప్రజాశక్తి

శుక్రవారం 2 ఆగస్టు 2024 8 పేజీలు

గుంటూరు

పల్నాడు

పాఠశాలల్లో ఎన్నికల సందడి

నోటిఫికేషన్, ఓటర్ల జాబితా విడుదల

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

పాఠశాలలో ఎన్నికల సందడి ప్రారంభమైంది. స్కూలు మేనేజ్‌మెంట్ కమిటీల పేరుతో ప్రభుత్వం ఎన్నికలకు గురువారం నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ మేరకు జిల్లా అధికారులు కూడా నోటిఫికేషన్ జారీ చేశారు. ఓటర్ల జాబితాలను కూడా ప్రకటించారు. ఈనెల 8న ఎన్నికలు జరగనున్నాయి.

సెక్షన్లు, మీడియంతో సంబంధం లేకుండా క్లాసు యూనిట్ గా ముగ్గురు సభ్యుల ను ఎన్నుకొనాలి. వీరిలో కనీసం ఇద్దరు మహిళలు. ముగ్గురిలో ఒకరు తప్పక ఎస్‌సి,ఎస్‌టి, వికలాంగులు, మరొకరు తప్పక బిసి, ఈబిసి, మైనార్టీకి చెందిన వ్యక్తి అయి ఉండాలి. తరగతి నుంచి నుండి సభ్యుల ఎన్నికకు 50 శాతం ఓటర్లు హాజరును రిజిష్టర్‌లో చూపిన తర్వాతనే ఎన్నిక జరపాలి. చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికకు కూడా 50 శాతం సభ్యులు హాజరు ఉండాలి. క్లాసు వారీగా ఎన్నికైన సభ్యులందరూ స్కూలు మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యులుగా ఉంటారు. వీరందరూ కలసి కమిటీ వైస్ ఛైర్మన్ ను ఎన్నుకుంటారు. వీరిలో ఒకరు తప్పని సరి మహిళ, వీరిద్దరిలో ఒకరు ఎస్‌సి, ఎస్‌టి, వికలాంగులు తప్పని సరిగా ఉండాలి.

క్లాసులో కనీసం ఆరుగురు విద్యార్థులు లేకపోతే వీరిని మరొక తరగతిలోకి విలీనం చేసి ఎన్నుకోవాలి. పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు ఎన్నికల అధికారిగా ఉంటారు. తహశీల్దారు, ఎంపిడీవో, విఆర్‌వో, విఆర్‌ఏ ఎన్నికల పరిశీలకులుగా ఉంటారు. తల్లి,తండ్రి, పిల్లల సంరక్షకుడుగా నమోదైన వారు ఓటర్లుగా ఉంటారు. వీరి జాబితాలను గురువారం ప్రకటించారు. ఈనెల 5వ తేదీలోగా జాబితాలపై అభ్యంతరాలు తెలియచేసేందేకు అవకాశం ఇచ్చారు. 8వ తేదీ మధ్యాహ్నం 1 గంటలోపు సభ్యుల ఎన్నిక, తరువాత చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక నిర్వహిస్తారు. మూడు గంటలకు కమిటీ తొలి సమావేశం జరుగుతుంది. పాఠశాల విద్యా కమిటీలో ప్రతి సభ్యునికి రెండేళ్ల పదవీకాలం ఉంటుంది. విద్యార్థి స్కూలు నుంచి వెళ్లిన వెంటనే సంబంధిత తల్లిదండ్రుల సభ్యత్వం రద్దవుతుంది.

గత ప్రభుత్వ హయంలో పేరెంట్స్ కమిటీ పేరుతో నాడు-నేడు పనుల పర్యవేక్షణ బాధ్యత అంతా వైసిపికి చెందిన నాయకులే తీసుకున్నారు. ఈ సందర్భంగా పలు ఆరోపణలు కూడా వచ్చాయి. రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో ఈ ప్రభావం పాఠశాల మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలపై కూడా పడుతుందని తెలుస్తోంది. ప్రధానంగా టిడిపి కూటమికి చెందిన వారినే చైర్మన్, వైస్ చైర్మన్‌గా ఎన్నుకునే విధంగా అధికార పార్టీ ప్రయత్నిస్తున్నట్టు తెలిసింది. క్షేత్రస్థాయిలో పట్టు సాధించేందుకు రాజకీయ పార్టీలకు పాఠశాల కమిటీ ఎన్నికలు ఒక వేదిక కావడంతో ప్రధానంగా టిడిపి, వైసిపి ఈ ఎన్నికలపై దృష్టి సారించాయి. జిల్లాలో 1061 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా వీటిల్లో అన్ని పాఠశాలల్లో ఎన్నికల నిర్వహణకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఎక్కువ పాఠశాలల్లో ఎన్నికలు ఏకగ్రవంగా జరిగేలా వ్యూహరచన చేస్తున్నారు. ఈ వారం మొత్తం హెచ్‌ఎంలు ఈ ఎన్నికల నిర్వహణపై దృష్టి సారించాల్సిన పరిస్థితి ఏర్పడింది.

పింఛను పంపిణీ చేస్తున్న గుంటూరు జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి

చురుగ్గా పింఛన్ల పంపిణీ

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

ఎన్‌టిఆర్ భరోసా పింఛన్ల పంపిణీ గుంటూరు, పల్నాడు జిల్లాల్లో గురువారం చురుగ్గా కొనసాగింది. ప్రజా ప్రతినిధులు, ఉన్నతాధికారులు పింఛన్ల పంపిణీలో పాల్గొన్నారు. గుంటూరులో కలెక్టరు ఎస్.నాగలక్ష్మి, ఎమ్మెల్యేలు గళ్లా మాధవి, నశీర్ అహ్మద్, బి.రామాంజనేయులు పింఛన్ల పంపిణీలో పాల్గొన్నారు. పల్నాడు జిల్లా రొంపిచర్ల మండలం, అలవాలలో పింఛను పంపిణీని పల్నాడు జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు ప్రారంభించారు. ఆయా నియోజకవర్గాల ప్రజా ప్రతినిధులంతా వారి నియోజకవర్గాల్లో పాల్గొన్నారు. రాత్రి 8 గంటల వరకు అందిన సమాచారం ప్రకారం గుంటూరు జిల్లాలో 2,57,390 లబ్ధిదార్లుండగా 2,51,428 (97.68 శాతం) మందికి, పల్నాడు జిల్లాలో 2,78,219 మంది ఉండగా 2,71,838 (97.71 శాతం) మందికి పంపిణీ చేసినట్టు అధికారులు తెలిపారు. గుంటూరు కార్పొరేషన్‌లో 98 శాతం పంపిణీ చేసినట్టు నగర కమిషనర్ సూర్యదేవర హరికృష్ణ తెలిపారు. మొత్తం 58,971 మందికి గాను 57,703 మందికి పంపిణీ చేశామన్నారు. వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలకు రూ.4 వేలు, వికలాంగులకు రూ.6 వేలు అందించారు. మిగతా వారికి శుక్రవారం పంపిణీ పూర్తి చేస్తారని అధికారులు తెలిపారు.

డ్వామా పీడీ జోసెఫ్ కుమార్‌కు వినతిపత్రం ఇస్తున్న ఉపాధి హామీ కూలీలు, నాయకులు

ఉపాధి హామీ కూలి రూ.40 కోట్ల పెండింగ్

సత్వరమే చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో డ్వామా పీడీ కార్యాలయం వద్ద కూలీల ధర్నా, వినతి

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా

తమకు కూలి బకాయిలు సత్వరమే చెల్లించాలని జాతీయ గ్రామీణ ఉపాధి హామీ కూలీలు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేట పట్టణంలోని జిల్లా నీటి యాజమాన్య సంస్థ (డ్వామా) ప్రాజెక్ట్ డైరెక్టర్ కార్యాలయం వద్ద గురువారం ధర్నా చేశారు. సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు అనుముల లక్ష్మీశ్వరరెడ్డి మాట్లాడుతూ ఉపాధి హామీ పనులు చేసి నెలలు గడుస్తున్నా కూలివ్వకపోవడం అన్యాయమన్నారు. కూలీల్లో అధిక శాతం మంది ఏరోజు పని చేసుకుంటేగా ఆ రోజు పూటగడవని కుటుంబాలని చెప్పారు. కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చాక ఉపాధి హామీకి బడ్జెట్లో కోతలు విధించిందని, వేసవి అలవెన్స్, మజ్జిగ, తాగునీరు, ఇతర అలవెన్సులు రద్దు చేసిందని విమర్శించారు. చట్టాన్ని పటిష్టంగా అమలు చేయడంతోపాటు ఏడాదికి 200 పనిదినాలు కల్పించాలని, ఇందుకోసం కూలీలు ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. సంఘం పల్నాడు జిల్లా కార్యదర్శి జి.రవిబాబు మాట్లాడుతూ పల్నాడు జిల్లాలో రూ.40 కోట్ల వరకు కూలి బకాయిలున్నాయని

▶ 2లో

సాగర్‌కు కొనసాగుతున్న ప్రవాహం

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

నాగార్జున సాగర్ జలాశయంకు నీటి ప్రవాహం కొనసాగుతోంది. శ్రీశైలం నుంచి దాదాపు ఐదు లక్షల క్యూసెక్కుల నీరు దిగువకు వదులుతుండగా సాగర్ జలాశయానికి 2.59 లక్షల క్యూసెక్కులు వస్తోంది. సాగర్ నుంచి దిగువకు కాల్వల ద్వారా 30,368 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. సాగర్ పూర్తిస్థాయి నీటిమట్టం 590 అడుగులు కాగా గురువారం రాత్రి 9 గంటలకు 537.80 అడుగుల వరకు నీటి నిల్వ ఉంది. పూర్తి నీటి నిల్వ సామర్థ్యం 312 టీఎంసీలుగా కాగా ప్రస్తుత 185.84 టీఎంసీల నిల్వ ఉన్నట్టు అధికారులు తెలిపారు. ఎగువ నుంచి ఇదే ప్రవాహం కొనసాగితే వారం రోజుల్లో సాగర్ జలాశయం నిండుతుందని వచ్చే వారం సాగర్ గేట్లు తెరిచి నీటిని దిగువకు విడుదల చేసే అవకాశం ఉందని చెబుతున్నారు. పులిచింతల గరిష్ట నీటి నిల్వ 47 టీఎంసీలు కాగా ప్రస్తుతం 1.11 టీఎంసీ నిల్వ మాత్రమే ఉంది. సాగర్ నుంచి పులిచింతలకు ఇంకా నీటి విడుదల ప్రారంభం కాలేదు. సాగర్‌లో త్వరలో విద్యుత్ ఉత్పత్తి ప్రారంభిస్తే పులిచింతలకు నీటి విడుదల చేస్తారని చెబుతున్నారు. శ్రీశైలానికి ప్రస్తుతం 3.09 లక్షల క్యూసెక్కుల నీరు వస్తుండటంతో ఇదే ప్రవాహం దిగువకు వస్తే కనీసం వారం రోజుల్లో సాగర్ జలాశయం నిండుతుంది.

సదస్సులో మాట్లాడుతున్న శ్రామిక మహిళా సమన్వయ కమిటీ రాష్ట్ర కన్వీనర్ కె.ధనలక్ష్మి

అన్ని రంగాల్లో రాణిస్తున్నా వివక్షే!

- సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం లైంగిక వేధింపుల నిరోధక కమిటీ వేయాలి
- పాలకులు మారిన ప్రతిసారీ స్కీమ్ వర్కర్లపై వేధింపులు దుర్మార్గం
- శ్రామిక మహిళ జిల్లా సదస్సులో రాష్ట్ర కన్వీనర్ కె.ధనలక్ష్మి

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

కుటుంబ వ్యవస్థలో మహిళల పాత్ర ఎంతో కీలకమని, అదే చొరవ అదే ఒరవడితో నేడు సమాజంలో అన్ని రంగాల్లో పురుషులతో పాటు మహిళలు రాణిస్తున్నా వివక్ష, లైంగిక వేధింపులు ఎక్కువయ్యాయని శ్రామిక మహిళ సమన్వయ కమిటీ రాష్ట్ర కన్వీనర్ కె.ధనలక్ష్మి అన్నారు. పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేట పట్టణంలోని పల్నాడు రోడ్డులో గల ఎస్ఎస్ఎన్ కళాశాల ఆడిటోరియంలో శ్రామిక మహిళ పల్నాడు జిల్లా సదస్సు గురువారం జరిగింది. కార్యక్రమానికి శ్రామిక మహిళా సమన్వయ కమిటీ పల్నాడు జిల్లా కన్వీనర్ డి.శివకుమారి అధ్యక్షత వహించారు. ధనలక్ష్మి మాట్లాడుతూ మహిళలపై వేధింపులు అరికట్టేందుకు బాధ్యతాయుతంగా పనిచేయాల్సిన పాలకులు, అధికారులే మహిళల పట్ల బాధ్యతాయుతంగా మాట్లాడాలన్నారు. 2013 సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం మహిళలపై లైంగిక వేదిక కమిటీ వేయాలని డిమాండ్ చేశారు. అంగన్వాడీ, ఆశా, మధ్యాహ్న భోజన కార్మికులు ఇలా పలు రంగాలలో 3.50 లక్షల మంది, కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ విభాగంలో మరో 3.50 లక్షల మంది మహిళలు వివిధ రంగాల్లో పనిచేస్తున్నారని తెలిపారు. పాలకులు ఎన్నికలకు ముందు

▶ 2లో

అన్ని రంగాల్లో రాణిస్తున్నా వివక్షే!

(మొదటి పేజీ తరువాయి)

ఇచ్చిన వాగ్దానాలు అమలు చేయకుండా మహిళలను మోసం చేస్తున్నారని, కార్మికులను ఉద్యోగులకు అనేక ప్రలోభాలు చూపి చివరకు అదే ఉద్యోగులపై రాజకీయ వేధింపులకు పాల్పడుతున్నారని విమర్శించారు. ఉద్యోగ భద్రత, కనీస వేతనాలు చట్టబద్ధత లేదని, ఉద్యోగులకు సంబంధించి చట్టాలు ఏవీ సమర్ధవంతంగా అమలు కావడం లేదని చెప్పారు. చివరకు రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వకుండా ఇంటికి పంపిస్తున్నారని ఆవేదన వెలిబుచ్చారు. ఎన్నికలు వచ్చిన ప్రతిసారి పాలకులు మారినప్పుడు చిరుద్యోగులపై తీవ్రమైన దాడులు జరుగుతున్నాయని, తమ అనునయులకు ఉద్యోగాలు కట్టపెట్టేందుకు దీర్ఘకాలంగా పనిచేస్తున్న కాంట్రాక్ట్, స్కీం వర్కర్లను తొలగించడం ఎంతవరకు సబబని ప్రశ్నించారు. మరోవైపు మహిళలపై, చిన్నారులపై, చివరకు భిక్షాటన చేసే మహిళలపై సైతం అత్యాచారాలు జరుగుతున్నాయని అన్నారు. సినీమాల్లో సెన్సార్ బోర్డు సక్రమంగా పనిచేయడం లేదన్నారు. సీరియల్‌లో సినిమాలలో వివిధ సోషల్ మీడియా వేదికగా అశ్లీల చిత్రాలు వైరల్ అవుతున్నాయని, నివారణకు ప్రభుత్వం పాలకవర్గాలు దృష్టి పెట్టాలని కోరారు. గంజాయి, మద్యం మత్తు పదార్థాలు రాష్ట్రంలో ఏరులై పారుతోందని, దీన్ని నివారించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ పల్నాడు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కెపి.మెటిల్డాదేవి, గుంటూరు మల్లేశ్వరి, సిఐటియు పల్నాడు జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కె.హనుమంత్‌రెడ్డి, ఎస్.ఆంజనేయులు నాయక్, వివిధ రంగాల్లో పని చేస్తున్న మహిళలు పాల్గొన్నారు.

ఉపాధి హామీ కూలి రూ.40 కోట్ల పెండింగ్

(మొదటి పేజీ తరువాయి)

తెలిపారు. పని ప్రదేశంలో ప్రమాదం జరిగితే ప్రథమ చికిత్స చేయటానికి ఫస్ట్ ఎయిడ్ కిట్లు అందుబాటులో లేవన్నారు. ఉపాధి హామీ అమలులో కీలకమైన ఫీల్డ్ అసిస్టెంట్ల నియామకాల్లో రాజకీయ జోక్యంతో చట్టం లక్ష్యం పక్కదారి పడుతోందన్నారు. కూలీలకు పే స్లిప్పులు ఇవ్వాలన్నారు. సాగర్ కాల్వల కింద మాగాణి సాగయ్యే ప్రాంతంలో సాగర కాల్వకు నీరు వస్తుందో రాదో అని అర్థం కాని పరిస్థితి నెలకొన్న నేపథ్యంలో వ్యవసాయ కార్మికులకు పనుల్లేక ఇబ్బందులు పడుతున్నారని, ఆయా మండలాల్లో ఉపాధి హామీ పనులను కొనసాగించాలని డిమాండ్ చేశారు. సంఘం జిల్లా అధ్యక్షులు కె.రోశయ్య మాట్లాడుతూ జాబ్ కార్డుల్లో మార్పులు, చేర్పులకు అవకాశం కల్పించాలని, కొత్తవారికి జాబ్ కార్డులు మంజూరు చేయాలని కోరారు. అనంతరం డ్వామా పీడీ జి.జోసెఫ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఆయన స్పందిస్తూ త్వరలోనే వేతనాలు వచ్చే అవకాశం ఉందని చెప్పారు. ఉపాధి హామీ కూలీలకు ఎక్కడ ఏ సమస్య ఉన్నా తన దృష్టికి తెస్తే పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా నాయకులు కె.నాగేశ్వరరావు, జె.భగత్, ఎస్.లూథర్, ఎ.వెంకటేశ్వర్లు, బి.బాలకోటయ్య, వెంకటస్వామి, బి.అనూష, డి.వెంకటేశ్వర్లు, మరియదాసు, శ్రీనివాసరావు, చిన్న, తాతారావు, చిన్నఏసుమ్మ, నాగమ్మ, సురేష్ పాల్గొన్నారు.పోటోరైటప్ 01ఎం.సి.ఎల్ 08-04

మెరుగుపడుతున్న పారిశుధ్యం

ప్రజాశక్తి - మాచర్ల

అన్నా క్యాంటీన్ పనులు శరవేగంగా సాగుతున్నాయి. ప్రభుత్వం ఆగస్టు 15వ తేది నుండి అన్నా క్యాంటీన్లు పేదలకు అందుబాటులోకి తీసుకురానున్న నేపథ్యంలో కమిషనర్ దేవళ్ల వెంకటదాసు స్థానికంగా ఉన్న అన్నా క్యాంటీన్ పనులను ప్రత్యేకంగా పర్యవేక్షిస్తున్నారు. ప్రస్తుతం అన్నా క్యాంటీన్‌లో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న ఆర్యవైశ్య సంఘ నాయకులు సూరె యల్లమంద, దారివేముల రామక్రిష్ణ, చీదేళ్ల ఆంజనేయులుతో వసతుల గురించి చర్చించారు. తెల్లవారుజాము నుండే పారిశుధ్య పనులను కమిషనర్ పర్యవేక్షించారు. అనంతరం పించన్ల పంపిణీలో పాల్గొన్నారు.

నాడు-నేడు పేరుతో పెద్ద ఎత్తున దోపిడి : యరపతినేని

ప్రజాశక్తి-పిడుగురాళ్ల

నాడు నేడు పేరుతో గత ప్రభుత్వంలో పెద్ద ఎత్తున దోపిడి జరిగిందని గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు అన్నారు. గురువారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల నందు విద్యార్థులకు ప్రభుత్వ విద్యా కిట్లు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి, ఎమ్మెల్యే శ్రీనివాసరావు హాజరైయ్యారు. ఎమ్మెల్యే మాట్లడుతూ గత ప్రభుత్వంలో విద్య వ్యవస్థ నిర్వీర్యం అయ్యిందని విద్యార్థుల భవిష్యత్‌తో ఆడుకున్నారని గౌరవించాల్సిన గురువులను అనేక ఇబ్బందులకు గురిచేశారన్నారు.విద్యా వ్యవస్థను పటిష్టం చేసేందుకు మంత్రి నారా లోకేష్ ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారని అన్నారు.పిడుగురాళ్ళ ప్రభుత్వ జూనియర్ కళాశాల గురించి మంత్రి నారా లోకేష్ వద్ద చర్చిస్తాం డిగ్రీ కళాశాలకు అప్‌గ్రేడ్ చేసేందుకు ప్రయత్నిస్తామని అన్నారు. కళాశాల సమస్యల గురించి ప్రిన్సిపాల్‌ని వివరాలు అడిగి తెలుసుకున్నామని అన్నారు. విద్యార్థులు లక్ష్యాన్ని ఏర్పటు చేసుకొని లక్ష్య సాధన దిశగా మందుకు అడుగులు వేయాలని చెప్పారు. ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి మాట్లడుతూ ఇంటర్‌మీడియట్ దశలో విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని మన భవిష్యత్‌ను నిర్ణయించే దశ ఇదేనని విద్యార్థులు లక్ష్య సాధన దిశగా కృషి చేసి భవిష్యత్‌లో ఉన్నత స్థాయిలోకి ఎదగాలని అన్నారు.అనంతరం విద్యార్థులకు ప్రభుత్వ విద్యా కిట్లు పంపిణీ కార్యక్రమం నిర్వహించి కళాశాలలోని తరగతి గదులను పరిశీలించారు.ఈ కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకులు కల్లం రాజశేఖర్ రెడ్డి, పిడుగురాళ్ళ తహశీల్దార్ మధుబాబు, జెడ్‌పి పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ధనలక్ష్మీ మరియు సిబ్బంది పాల్గొన్నారు.

అవినీతి రహిత పాలనే ప్రభుత్వ ధ్యేయం : ఎమ్మెల్యే ప్రవీణ్

ప్రజాశక్తి - అమరావతి

అవినీతి రహితమైన ప్రజా పాలన ప్రజలకు అందించేందుకు ఆయా శాఖ అధికారులు అలసత్వాన్ని విడనాడి శక్తి వంచన లేకుండా కృషి చేయాలని అలా చేయని అధికారులపై చట్టపరమైన చర్యలు తప్పవని పెద్దకూరపాడు శాసనసభ్యులు భాష్యం ప్రవీణ్ హెచ్చరికలు జారీ చేశారు. గురువారం మండల కేంద్రమైన అమరావతిలోనే అమరావతి మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో జరిగిన సర్వసభ్య సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. సమావేశానికి ఎంపీపీ మేకల హనుమంతరావు అధ్యక్షత వహించారు.ఈసందర్భంగా ప్రవీణ్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల నుండి మండల ప్రాంతం వరకు ఉన్నత అధికారుల వద్దకు మౌలిక సదుపాయాలతో పాటు రెవెన్యూ సమస్యలపై వచ్చే ప్రజల కోసం ఒక్క రూపాయి ఆశించకుండా ఆయా సమస్యలను యుద్ధ ప్రాతిపదికన పరిష్కరించి వారికి తగు న్యాయం చేకూర్చాలని అన్నారు. నియోజవర్గంలోనే వివిధ గ్రామాలలో ఉన్న ఇసుక రీచ్‌లు, గ్రావెల్ మట్టి తదితర వాటిలో ప్రభుత్వం ఆదేశాలకి భిన్నంగా వ్యవహరిస్తూ అధికారులు కానీ అనధికారులు గాని ప్రజలకు అన్యాయం చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. ప్రజల సమస్యల పరిష్కారం కోసం పంచాయతీ ఆఫీస్ సచివాలయాల వద్ద నుండి తహసిల్దార్, ఎండిఓ వివిధ ఆఫీసుల్లో పనిచేస్తున్న అధికారులు ఉదయం 10 నుండి సాయంత్రం ఐదు గంటల వరకు తప్పనిసరిగా ఉద్యోగ బాధ్యతగా వ్యవహరిస్తూ ప్రజలకు అందుబాటులో ఉండి వాళ్ళ సమస్యలను పరిష్కరించాలని అన్నారు. నియోజవర్గంలో ఇసుక మాఫియా, ఇసుక, గ్రావెల్, రెవెన్యూ భూములు తదితర అంశాలపై ఎక్కడ కూడా న్యాయపద్ధమైనటువంటి ప్రక్రియకు భిన్నంగా వ్యవహరించిన వారిపై క్షమించేది లేదని హెచ్చరించారు. మండల పరిధిలోనే ఆయా గ్రామాలలో అభివద్ధిపై సంబంధిత శాఖ అధికారులను అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో మండల పరిషత్ ఉపాధ్యాక్షులు మంగిశెటి శ్రీనివాసరావు, ఎంపిడిఒ జి.రాణి, టిడిపి నాయకులు బి.వెంకటేశ్వర్లు, ఎస్.కె.జాని, కె.వసంతరావు, పి.రామకృష్ణ, ఎం.విష్ణు, వి.అఖిల్, సుధాకర్ పాల్గొన్నారు.

పాత్రికేయుల పిల్లలకు పుస్తకాలు పంపిణీ

ప్రజాశక్తి - మాచర్ల : మాచర్ల నియోజకవర్గ వర్కింగ్ జర్నలిస్టుల ఆధ్వర్యంలో పలువురు పాత్రికేయుల పిల్లలకు గురువారం నోట్ బుక్స్ పంపిణి చేశారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి పుస్తకాలను అందించి మాట్లాడారు. పాత్రికేయులకు తమ ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. యూనియన్ అధ్యక్షులు కొత్తమాసు శ్రీరామమూర్తి, మాగులూరి రాంబాబు, గణేష్, కూటమి పార్టీల నాయకులు యాగంటి మల్లికార్జునరావు, వై.కేశవరెడ్డి, మదార్‌సాహెబ్, కొమెర దుర్గారావు, మంచికల్లు సీతారెడ్డి, కంభంపాటి అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

వాహన పత్రాలు తప్పనిసరి

ప్రజాశక్తి - మాచర్ల : వాహనదారులు అవసరమైన పత్రాలతో రహదారులపైకి రావాలని అర్బన్ ఎస్ఐ గోపాల్ సూచించారు. పట్టణంలో ఆయన గురువారం వాహనాల తనిఖీ చేపట్టారు. తగిన పత్రాలు లేని వాహనదారులపై కేసులు నమోదు చేసి పెనాల్టీ విధించారు. నంబర్ ప్లేట్ లేని వాహనాలను సీజ్ చేస్తామన్నారు. నిబంధనలకు లోబడి డ్రైవింగ్ చేయాలన్నారు.

రోడ్ల విస్తరణ కోసం పోరాటం

ప్రజాశక్తి - చిలకలూరిపేట

పట్టణంలో ప్రధాన రహదారుల విస్తరణ, ట్రాఫిక్ నియంత్రణ కోసం విసికె పార్టీ పోరాటం చేయనుందని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి వి.జాన్ ముత్తయ్య అన్నారు. స్థానిక ఎన్‌ఆర్‌టి సెంటర్లోని కార్యాలయంలో గురువారం విలేకర్లతో మాట్లాడారు. పట్టణంలో దాదాపు లక్ష మందికి పైగానే జనాభా ఉన్నారని, వారి అవసరాల దృష్ట్యా రోడ్లను తప్పనిసరిగా విస్తరించాలని కోరారు. రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద నుంచి చౌత్ర సెంటర్ మీదుగా గడియారం స్తంభం వరకు ఉన్న రోడ్డుకి రెండు వైపులా ఆక్రమణలను వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు.

అసాంఘిక కార్యకలాపాలు చేస్తే కఠిన చర్యలు

ప్రజాశక్తి-పిడుగురాళ్ల

అసాంఘీక కార్యక్రమాలకు పాల్పడిన,బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని పిడుగురాళ్ళ సిఐ వెంకట్రావ్ గురువారం తెలియజేశారు.పట్టణంలో బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తున్న వారిని అదుపులోకి తీసుకుని వారికి కౌన్సిలింగ్ ఇవ్వడం జరిగిందని ఆయన తెలిపారు.పట్టణ,మండల పరిధిలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరిగిన వెంటనే తమకు తెలయజేయాలని ప్రజలను కోరారు.వెంటనే స్పందించి చర్యలు తీసుకుంటామని ఆయన తెలియజేశారు.ప్రజలకు ఇబ్బందులు ఏమైన ఇబ్బందులు ఉంటే పట్టణ పోలీస్ స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేయవల్సిందిగా తెలియజేశార

లక్కరాజు గార్లపాడులో పశువైద్య శిబిరం

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

మండలంలోని లక్కరాజుగార్లపాడులో ఉచిత పశు వైద్య శిబిరం గురువారం నిర్వహించారు. పశుసంవర్ధక శాఖ మరియు పశుగణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో గర్భకోశ వ్యాధుల చికిత్సా శిబిరం ఏర్పాటు చేశారు. 50 గేదెలకు గర్భకోశ వ్యాధులకు సంబంధించి రోగాలను గుర్తించి చికిత్స చేశారు. 15 పశువులకు సాధారణ కేసులు, 25 దూడలకు నులుపురుగుల నివారణ మందును పంపిణీ చేశారు. అనంతరం పశుపోషకులకు అవగాహన సదస్సు నిర్వహించారు. లింగ నిర్ధారణ వీర్యం ప్రాముఖ్యతను డాక్టర్ బాలశంకరావు వివరించారు. పశుసంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ పి.రామారావు, నర్సరావుపేట సహాయ సంచాలకులు ఎన్ .నరశింహులు, సత్తెనపల్లి సహాయ సంచాలకులు డాక్టర్ ఎం.శ్రీనివాసరావు, సర్పంచ్ జొన్నలగడ్డ మరియమ్మ, పశువైద్యులు డాక్టర్ జి.చంద్రశేఖర్‌రెడ్డి, డాక్టర్ ఎం.పుల్లారెడ్డి, డాక్టర్ జి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పొలాల్లో అధికారుల పరిశీలన

ప్రజాశక్తి-ఈపూరు

మండలంలోని కొచ్చర్లకు చెందిన రైతు గోలి రత్తయ్య సాగుచేసిన పెసర, దోస పంటలను మండల వ్యవసాయాధికారి ఆర్.రామారావు గురువారం పరిశీలించారు. దోస పంటలో తామర పురుగు, సూక్ష్మ మూలకాల లోపాలను గుర్తించారు. తామర పురుగు నివారణకు ఎసిఫేట్ 300 గ్రాములు (ఎకరానికి), సూక్ష్మ మూలకాల లోపాలకు ఫార్ములా-4 300 గ్రాములు (ఎకరానికి) పిచికారి చేయాలని, పెసర పంట నందు ఎసిఫేట్ 300 గ్రాములు (ఎకరానికి), వేపనూనె 200 మిల్లీ లీటర్లు (ఎకరానికి) పిచికారి చేయాలని రైతుకు సూచించారు. పంటల పరిశీలనలో గ్రామ వ్యవసాయ సహాయకులు కె.కిషోర్ కుమార్, రైతులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి
గుంటూరు, పల్నాడు 3
శుక్రవారం 2 ఆగస్టు 2024

ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా సుప్రీంకోర్టు తీర్పుపై హర్షం

వర్సిటీ ప్రధాన ముఖద్వారం ఎదుట బాణాసంచ పేల్చి, మిఠాయిలు పంచిన ఉద్యోగులు

ప్రజాశక్తి - ఎఎన్‌యు

భారతదేశ సర్వోన్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా తీర్పు ఇవ్వటంపై ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ప్రాంగణంలో ఎమ్మార్పీఎస్ అను బంధ ఉద్యోగ సంఘాలు, ఉద్యోగులు, పరిశోధకులు విద్యార్థులు సంబరాలు చేసుకున్నారు. గురువారం నాగార్జున వర్సిటీ ముఖద్వారం వద్ద సంబరాలు చేపట్టారు. ర్యాలీగా వర్సిటీ ప్రాంగణంలోని భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్, మహాత్మ జ్యోతిరావు పూలే, డాక్టర్ బాబు జగజీవన్ రావ్ విగ్రహాలకు పాలాభిషేకం చేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వర్సిటీ అధ్యాపకులు ఆచార్య పి రత్నాకర్, ఆచార్య కే సుమంత్ కుమార్, ఆచార్య కే మధుబాబు, డాక్టర్ ఎన్ ప్రసన్నకుమార్, డాక్టర్ ఎన్ రతన్ కిషోర్, డాక్టర్ నంబూరు బాబు, డాక్టర్ మహేంద్ర కుమార్, డాక్టర్ పి శ్యామ్సన్, డాక్టర్ సతీష్, డిప్యూటీ ఇంజనీర్ జె అప్పారావు, బోధ నేతరా సిబ్బంది సంఘ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

తెనాలిలో

ప్రజాశక్తి - తెనాలి

ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా సుప్రీంకోర్టు తీర్పు పై మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి, దాని అనుబంధ సంఘాలు, బాబూ జగ్జీవన్ రామ్ కమిటీ ఆధ్వర్యంలో హర్షం వ్యక్తం చేశారు. పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షులు మంద కృష్ణ మాదిగ నాయకత్వం వర్ధిల్లాలి అంటూ నినదించారు. రైల్వే స్టేషన్ రోడ్డులోని జగ్జీవన్ రామ్ విగ్రహానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు కృష్ణ మాదిగ 30ఏళ్ళ అవిశ్రాంత పోరాటం ఫలించిందన్నారు. ఉద్యమంలో అశువులు బాసిన పలువురికి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు సుద్దపల్లి నాగరాజు, మేకల సురేష్, నలుకుర్తి రమేష్, అత్తోట శరత్, యాజలి గాంధీ పాల్గొన్నారు.

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

ప్రత్తిపాడు నియోజకవర్గ కేంద్రంలోని బస్టాండ్ సెంటర్ వద్ద ఉన్న అంబేద్కర్ మరియు జగ్జీవన్ రావ్ విగ్రహాలకు ఎమ్మార్పీఎస్ నాయకులు పాలాభిషేకం చేసి హర్షం వ్యక్తం చేశారు. బాణాసంచా కాల్చి ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు తోడేటి ఏసుపాదం, దున్న సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రత్తిపాడులో

వర్సిటీలో బిసి ఉద్యోగులకు సన్మానం

ప్రజాశక్తి - ఎఎన్‌యు

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ బిసి ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జులై 31న ఉద్యోగ విరమణ చేసిన బీసీ ఉద్యోగులకు సన్మాన కార్యక్రమం గురువారం జరిగింది. ఉద్యోగ విరమణ చేసిన రమాదేవి, ఏడుకొండలు, టి. శివన్నారాయణ, వెంకటరత్నమ్మ, బి. తిరుపతయ్య, టి తిరుపతయ్య లకు సన్మానం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర బీసీ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కేశన శంకర్రావు, యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ సింహాచలం, సైన్స్ కాలేజీ ప్రిన్సిపల్ ప్రొఫెసర్ కె.వీరయ్య అతిథులుగా ప్రొఫెసర్ త్రిమూర్తి రావు, ప్రొఫెసర్ మల్లికార్జున రావు, అడిషనల్ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ రెడ్డి ప్రకాష్, బీసీ యువజన సంఘం అధ్యక్షులు కుమ్మర క్రాంతి కుమార్, గుంటూరు జిల్లా బీసీ సంఘ అధ్యక్షుడు మల్లికార్జున, వికాస వైస్ ప్రెసిడెంట్ ఎన్ ప్రసాద్ రావు పదవీ విరమణ చేసిన ఉద్యోగులను సన్మానించారు. ఈ సందర్భంగా కేశన శంకర రావు మాట్లాడుతూ బీసీ ఉద్యోగులకు గాని బీసీ స్టూడెంట్స్ కు ఏదైనా బెనిఫిట్ చేసేందుకు తాను ముందుంటానని తెలియజేశారు. రిజిస్ట్రార్ మాట్లాడుతూ యూనివర్సిటీ అభివృద్ధికి అవసరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. సైన్స్ కాలేజీ ప్రిన్సిపల్ మాట్లాడుతూ బిసి విద్యార్థులకు ఉపాధ్యాయులకు, నాన్ టీచింగ్ ఎవరికైనా న్యాయం జరిగేటట్లు చూస్తానని చెప్పారు. కార్యక్రమంలోసంఘం అధ్యక్షుడు బీవీ ఉమామహేశ్వరరావు, కార్యదర్శి ఎన్. శ్రీనివాసరావు, ప్రొఫెసర్, ధనలక్ష్మి , ప్రొఫెసర్ పూర్ణచంద్ర రావు, ప్రొఫెసర్ తులసీదాస్, డాక్టర్ మాధవి, టీచింగ్, నాన్ టీచింగ్, కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్, డైలీ పేజ్, టైం స్కేల్, ఎన్ ఎమ్ ఆర్ ఉద్యోగ మిత్రులు తదితరులు పాల్గొన్నారు.

బాబా తాజుద్దీన్‌కు ఎమ్మెల్యే నరేంద్ర చద్దర్ సమర్పణ

ప్రజాశక్తి - పొన్నూరు

హుజూర్ హజరత్ సయ్యద్ బాబా తాజుద్దీన్ ఔలియా 102వ ఉరుసు గంధ మహోత్సవం సందర్భంగా చద్దర్‌ను పొన్నూరు నియోజకవర్గ శాసనసభ్యులు ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ సమర్పించారు. నాగపూర్ లో జరిగే హుజూర్ హజరత్ సయ్యద్ బాబా తాజుద్దీన్ ఔలియా జెండా గంధ మహోత్సవ కార్యక్రమానికి పొన్నూరు పట్టణంలోని డఫ్ పేటకు చెందిన ముస్లిం మైనారిటీ నాయకులు బయలుదేరి వెళ్లారు. బాబాకి చద్దర్ సమర్పించడానికి ఎమ్మెల్యే నరేంద్ర కుమార్ చింతలపూడి లోని ఆయన నివాస గృహంలో ప్రత్యేక ప్రార్థనలు జరిపిన అనంతరం డఫ్ పేట ముస్లిం మైనార్టీలకు అందజేశారు. ఈ సందర్భంగా ముస్లిం మైనార్టీ నాయకులు ఎమ్మెల్యే నరేంద్ర కుమార్ కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో ముస్లిం మైనార్టీ నాయకులు సయ్యద్ బాజీ, న్యాయవాది బాజీ సాహెబ్, షేక్ జానీ, షేక్ మీరావాలి, షేక్ మొహిదీన్, షేక్ జానీ భాష, గుంపుల చిన్న, గోగినేని రజిని కుమార్, ముబీన్, శ్రీను, జాన్ షైదా, డప్ పేట ముస్లిం యూత్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

చేబ్రోలు తహశీల్దార్‌గా శ్రీనివాసశర్మ

ప్రజాశక్తి - చేబ్రోలు : అవసరాల కోసం కార్యాలయానికి వచ్చే ప్రతి లబ్ధిదారునికి, మండల ప్రజలకు అందుబాటులో ఉండి ప్రభుత్వం కల్పించిన అవకాశాల ద్వారా మంచి చేయటమే లక్ష్యంగా పనిచేస్తామని చేబ్రోలు నూతన తహసిల్దార్ శ్రీనివాస శర్మ తెలిపారు. సాధారణ బదిలీలలో భాగంగా చేబ్రోలు మండల తహసీల్దారుగా మం గళవారం బాధ్యతలు స్వీక రించడం జరిగిందని ఆయన తెలిపారు.

గురజాల సిఎస్‌డిటిగా విధులు నిర్వర్తిస్తూ ప్రమోషన్ పై మేడికొండూరు తహశీల్దార్‌గా పనిచేసిన శ్రీనివాసశర్మ బదిలీపై చేబ్రోలు వచ్చారు. తొలుత షుగర్ కేన్ జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగిగా 1993 నుండి 2021 వరకు విధులు నిర్వహించి బెస్ట్ అవార్డు అందుకున్నారు. అనంతరం ఇనస్పెక్టర్ ఆఫ్ ఆఫీస్ జూనియర్ అసిస్టెంట్‌గా 2002 నుంచి 2005 వరకు విధులు నిర్వర్తించారు. తరువాత సత్తెనపల్లి మాచర్ల టౌన్, కొల్లిపర రెవెన్యూ ఇన్స్పెక్టర్ గాను, విధులు నిర్వర్తించి బెస్ట్ అవార్డు అందుకున్నారు. నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటామని ఆయన తెలిపారు.

నలుగురు జూదరుల అరెస్టు

ప్రజాశక్తి-తాడేపల్లి

తాడేపల్లి పట్టణంలోని ముగ్గురోడ్డు సమీపంలో గుట్టుచప్పుడు కాకుండా జరుగుతున్న పేకాట శిబిరంపై తాడేపల్లి సిఐ కల్యాణరాజు దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళతో సహా నలుగురు జూదరులను గురువారం అదుపులోకి తీసుకున్నారు. రూ.3 వేలు నగదు స్వాధీనం చేసుకున్నారు.

దావా సమను

IN THE COURT OF THE HON'BLE III ADDL.CIVIL JUDGE (JUNIOR DIVISION):: GUNTUR

OS No: 1240/ 2023

Between:
State Bank Of India, RACPC,
Guntur,Rep.by it's Chief Manager
....Plaintiff

And

Vadlamudi Naga Malleswari and Another
..... Defendants

To.
D-1: Vadlamudi Naga Malleswari,
W/o.Vadlamudi Narasimha Rao,
D-2: Vadlamudi Samba Siva Rao,
S/o.Vadlamudi Narasimha Rao, both are R/o.Flat No.301, S.N.L.Meridiam, 6th line, S.V.N.Colony,Near Venkateswara Swamy Temple, Guntur.

పై నెంబరు దావాలో 1 & 2 ప్రతివాదులు అయిన మీకు పై కోర్టు నుండి దావా సమన్లు పంపించినను మీరు తీసుకొనక కాలయాపన చేయుచున్నందున మీకు సమన్లు ఈ పేపరు ప్రకటన ద్వారా తెలియజేయమని ది:20-08-2024 కి వాయిదా వేసినారు.కావున ఆ రోజున ఉ. గం.10-30 ని.లకు పై కోర్టు వారి ఎదుట మీరు స్వయంగా గానీ లేక మీ వకీలు గారి ద్వారా గానీ హాజరై మీకు గల ఆక్షేపణలను తెలుపుకొనగలరు. లేనిచో శ్రీ కోర్టు వారిచే చట్ట ప్రకారం తీర్మానించ బడును.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

వాయిదా తేది:20-08-2024

కె.వి.ఆర్.హెచ్.ప్రసాద్ ,
వాది తరపు అడ్వకేట్,
రవీంద్ర నగర్, గుంటూరు.

మహారాజశ్రీ బాపట్ల ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో...

O.S.no:222/2023.

Between:
Madamachi Rama krishna and others
... వాదులు

V/s

Makineni Mallikarjuna Rao and
2 others ...... ప్రతివాదులు.

ప్రతివాది నెం.2
Makineni Sarat Chandra S/o Mallikarjura Rao, R/o Gorijavolu gunta palem village (pos), H/o Abbineni guntapalem, Pedanandipadu (mandal), Guntur(Dist)

పై నెంబరు దావా O.S.No: 222 / 2023 వాది దావా షెడ్యూలు స్థిరాస్తికి రికవరి ఆఫ్ పోజిషన్ ఉత్తర్వులు కోరుచూ దాఖలు చేశారు. పై దావాలో 2 వ ప్రతి వాది అయిన Makineni Sarat chandra అనే మీరు శ్రీ కోర్టు నోటీసులు తీసుకోనకుండ అలక్ష్యము చేస్తున్నందున శ్రీ కోర్టు వారు ఈ పేపరు ప్రకటన ద్వారా మీకు ఈ దావా సమను జారి నిమిత్తం ది.16-8-2024వ తేదీకి వాయిదా వేసినారు. కావున మీరు గానీ మీ తరఫున లాయర్ గారి ద్వారా గాని ది:16-8-2024 తేదిన ఉదయం 10 : 30 గంటలకు పైకోర్టుకు హాజరై మీ అక్షేపణలు తెలుపుకొనగలరు. లేని యెడల మీ పరో క్షమున తీర్మానించెదరని ఇందు మూలంగా తెలియజేటమైనది.

వాయిదాతేది:16-08-2024

రామినేని వెంకటేశ్వర్లు,
అడ్వకేట్,బాపట్ల.
సెల్: 9985304129

మహారాజశ్రీ నరసరావుపేట అదనపు సీనియర్ సివిల్‌జడ్జి గారి కోర్టులో

I.P. 21/2022

Between:
సన్నపురెడ్డి శివారెడ్డి ..... పిటీషనర్

V/s

దాచేపల్లి అనిల్ కుమార్ మరియు 15 మంది ఇతరులు
... రెస్పాండెంట్లు

To,
R7 : గంగారపు శివారెడ్డి, తండ్రి : శ్రీనివాసరెడ్డి, R/o చర్చి దగ్గర, మూడుబావుల సెంటర్, బరంపేట, నరసరావుపేట టౌన్, పల్నాడుజిల్లా.

పై నెంబరు ఐ.పి. పిటీషన్‌లో 7వ రెస్పాండెంటు అయిన మీకు ఎన్ని పర్యాయములు కోర్టు ద్వారా నోటీసులు పంపించినను తీసుకొనక కాలయాపన చేయుచున్నందున ఈ పేపరు ప్రకటన ద్వారా తెలియ చేయమని శ్రీ కోర్టువారు ది. 09-08-2024వ తేదీకి వాయిదా వేసియున్నారు. కావున మీరు పై తెలిపిన తేదీన పై కోర్టువారి యెదుట ఉదయం 10-30 గం.లకు మీరు స్వయంగా గానీ, లేదా అడ్వకేటు ద్వారా గానీ హాజరై మీకుగల ఆక్షేపణలు తెలియజేసుకొన వలసినదని కోరుచున్నాము. లేనియెడల మీ పరోక్షమందు విచారించి తీర్మానించబడునని తెలియజేయటమైనది.

(శ్రీ కోర్టువారి ఉత్తర్వుల ప్రకారం)

వాయిదాతేది:09-08-2024

ఇట్లు
మేదరమెట్ల నాగేశ్వరరావు,
పిటీషనరు తరపు అడ్వకేటు,
నరసరావుపేట.

మహారాజశ్రీ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్‌జడ్జి, తెనాలి వారి కోర్టులో

O.S. No. 475/2023

కాకుమాను ఉపేంద్ర ....వాది

ఎదిరి

యలవర్తి శివకృష్ణప్రసాదు అండ్ అనదర్
....ప్రతివాదులు

టు,
2వ ప్రతివాది: గాలి ప్రవీణ్‌చౌదరి, తండ్రి : వెంకట్ బాబు, హిందువు, వయస్సు 27 సం॥లు, వ్యాపారం, ఆర్/ఓ, డోర్‌న ఎం.1-132, కంచర్లపాలెం గ్రామం, తెనాలి మండలం, గుంటూరుజిల్లా.

పై నెంబరు దావాలో 2వ ప్రతివాది అయిన మీకు శ్రీ కోర్టువారి ఉత్తర్వుల ప్రకారం అనేక పర్యాయములు శ్రీ కోర్టు ద్వారాను మరియు రిజిష్టరు పోస్టు ద్వారాను దావా సమన్లు పంపినను మీరు తీసుకొనక కాలయాపన చేయుచున్నందున శ్రీ కోర్టువారి ఉత్తర్వుల ప్రకారం పేపరు ప్రకటన ద్వారా మీకు ఈ దావా సమను ఇవ్వడమైనది. సదరు దావా సమను ప్రకారం ది. 13-8-2024వ తేదీ ఉదయం 10-30 గం.లకు శ్రీ కోర్టువారి ఎదుట మీరు స్వయంగా గానీ, మీ తరఫు న్యాయవాది ద్వారా గానీ హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకొన వలెను. లేనియెడల సదరు దావాను మీ పరోక్షమున విచారించి తీర్మానించబడును.

(శ్రీ కోర్టువారి ఉత్తర్వుల ప్రకారం)

వాయిదాతేది : 13-8-2024

తాడిబోయిన శ్రీనివాసరావు,
వాదితరపు న్యాయవాది,
తెనాలి.
సెల్ : 98483 63744

మహారాజశ్రీ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్‌జడ్జి, తెనాలి వారి కోర్టులో

I.A. No. 1088/2023 in O.S. No. 475/2023

కాకుమాను ఉపేంద్ర ....పిటీషనర్ / వాది

ఎదిరి

యలవర్తి శివకృష్ణప్రసాదు అండ్ అనదర్
....రెస్పాండెంట్లు / ప్రతివాదులు

టు,
రెస్పాండెంటు- 2వ ప్రతివాది:
గాలి ప్రవీణ్‌చౌదరి, తండ్రి : వెంకట్‌బాబు, హిందువు, వయస్సు 27 సం॥లు, వ్యాపారం, ఆర్/ఓ, డోర్‌న ఎం.1-132, కంచర్లపాలెం గ్రామం, తెనాలి మండలం, గుంటూరుజిల్లా.

పై నెంబరు దావాలోని ఐ.ఎ. నెం. 1088/2023 లో రెస్పాండెంటు/ 2వ ప్రతివాది అయిన మీకు శ్రీ కోర్టువారి ఉత్తర్వుల ప్రకారం అనేక పర్యాయములు శ్రీ కోర్టు ద్వారాను మరియు రిజిష్టరు పోస్టు ద్వారాను నోటీసులు పంపినను మీరు తీసుకొనక కాలయాపన చేయుచున్నందున శ్రీ కోర్టువారి ఉత్తర్వుల ప్రకారం పేపరు ప్రకటన ద్వారా మీకు ఈ నోటీసు ఇవ్వడమైనది. సదరు నోటీసు సమను ప్రకారం ది. 13-8-2024వ తేదీ ఉదయం 10-30 గం.లకు శ్రీ కోర్టువారి ఎదుట మీరు స్వయంగా గానీ, మీ తరఫు న్యాయవాది ద్వారా గానీ హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకొన వలెను. లేనియెడల సదరు దావాలోని ఐ.ఎ. నెం.1088/2023ను మీ పరోక్షమున విచారించి తీర్మానించబడును.

(శ్రీ కోర్టువారి ఉత్తర్వుల ప్రకారం)

వాయిదాతేది : 13-8-2024

తాడిబోయిన శ్రీనివాసరావు,
వాదితరపు న్యాయవాది,
తెనాలి. సెల్ : 98483 63744

నాయకుల నివాళి, సభలో పాల్గొన్న వివిధ రంగాల కార్మికులు, నాయకులు

పర్సా సత్యనారాయణ స్ఫూర్తితో పోరాటాలు

శత జయంతి సభలో నాయకుల పిలుపు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

కార్మిక వర్గం కోసం పర్సా సత్యనారాయణ ఎన్నో త్యాగాలు చేశారని, తన ఊపిరి ఆగేంత వరకూ ఉద్యమాలకు ఊపిరిగా ఉన్నారని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ నర్సింగరావు అన్నారు. కార్మిక నేత, సిఐటియు వ్యవస్థాపక అధ్యక్షులు పర్సా సత్యనారా యణ శత జయంతి సభ పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేట పట్టణంలోని ఎస్ఎస్ఎన్ కళాశాల ఆడిటోరియంలో గురువారం నిర్వహించారు. సభకు సిఐటియు పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.ఆంజనేయులునాయక్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ చిత్రపటానికి నర్సింగరావు తోపాటు సిఐటియు రాష్ట్ర కార్యదర్శులు కె.ధనలక్ష్మి, ముజఫర్ అహమ్మద్, రైతు, కౌలు రైతు సంఘాల నాయకులు పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం ధనలక్ష్మి మాట్లాడుతూ ఉద్యమాల కోసం కుటుంబాన్ని వదిలిన పర్సా సత్యనారాయణ చివరి నిమిషం వరకు కార్మిక లోకం కోసం అక్షరాలు ఉత్తరాలు అందిస్తూనే ఉన్నారన్నారు. ఎమర్జెన్సీ సమయంలో వందల సంఖ్యలో మొదలైన సిఐటియు నేడు రాష్ట్ర వ్యాప్తంగా 5 లక్షలకు పైగా సభ్యులతో ఉందన్నారు. ఎన్నో పోరాటాలు చేసి ఎందరో కార్మికులకు అండగా నిలుస్తోందని చెప్పారు. ప్రస్తుత ప్రభుత్వాల విధానాలతో కార్మికులు, స్కీం వర్కర్లు, కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని విమర్శించారు. ఈ విధానాలను తిప్పికొట్టేందుకు కార్మికులు ఐక్యంగా ఉద్యమించాలన్నారు. ముజఫర్ అహ్మద్ మాట్లాడుతూ పర్సా సత్యనారాయణ స్ఫూర్తితో పోరాటాలకు సిద్ధం కావాలన్నారు. ఇటీవల శ్వేత పత్రం విడుదల చేసిన కూటమి ప్రభుత్వం శ్వేత పత్రంలో ఎక్కడ ఉద్యోగులు, కార్మికుల సంక్షేమం గురించి ప్రస్తావించలేదని, ఇదేమని అడిగితే ఒక ఏడాది వరకు ఉద్యోగులకు, స్కీం వర్కర్లకు వేతనాలు పెంచే ఆలోచన లేదని తేల్చి చెప్పారని అన్నారు. ఇటీవల ప్రభుత్వం పిలుపు మేరకు ఎమ్మెల్యేలు చీపురు పట్టి మురుగు కాలనీ శుభ్రం చేస్తున్నారని, అది కేవలం ఫొటోలు దిగి ఫ్రేములు కట్టించుకోవడానికేగాని వాస్తవంగా కార్మికులు చేసే శ్రమ విలువ తెలియాలంటే కొన్ని రోజులు పాటు నిజంగానే వారితో పాటు పనిచేయాలని అన్నారు. సిపిఎం పల్నాడు జిల్లా కార్యదర్శి గుంటూరు విజయకుమార్ మాట్లాడుతూ నూతన కూటమి ప్రభుత్వం ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేయాలని కోరారు. దేశ రాజకీయాలలో బిజెపి, మోడీ ప్రభుత్వాన్ని నియంత్రణలో పెట్టాల్సిన బాధ్యత లౌకిక పార్టీలపై ఉందన్నారు. కార్యక్రమంలో సిఐటియు పల్నాడు జిల్లా అధ్యక్షులు కె.హనుమంత్‌రెడ్డి, శ్రామిక మహిళా సమన్వయ కమిటీ జిల్లా కన్వీనర్ డి.శివకుమారి, కౌలు రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వై.రాధాకృష్ణ, పల్నాడు జిల్లా అధ్యక్షులు కె.రామారావు, రైతు సంఘం పల్నాడు జిల్లా కార్యదర్శి ఏపూరి గోపాలరావు, సిఐటియు నాయకులు ఎం.హరిపోతురాజు, టి.శ్రీను, షేక్ బందగీ సాహెబ్, పి.వెంకటేశ్వర్లు, సిలార్ మసూద్, బి.మహేష్, జి.మల్లీశ్వరి పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణపై సుప్రీం తీర్పునకు మాల సంఘాల జెసి నిరసన

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా సుప్రీం కోర్టు తీర్పును నిరసిస్తూ మాల సంఘాల జెఎసి ఆధ్వర్యంలో నాయకులు వుస్తెల జయరావు ఆధ్వర్యంలో పల్నాడు జిల్లా కేంద్రంలో నరసరావుపేట డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద రోడ్డుపై గురువారం బైటాయించారు. మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ గోదా జాన్‌పాల్ మాట్లాడుతూ ఏళ్ల తరబడి మెజారిటీ జనాభా కలిగిన దళితులు 15 శాతం రిజర్వేషన్‌కు పరిమితమై విద్యా, ఉద్యోగాల్లో ఇబ్బందులు పడుతుంటే రిజర్వేషన్ పెంచే ఆలోచన చేయని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, కొన్ని అగ్రవర్ణ మనువాద రాజకీయ పార్టీలు ఓటు బ్యాంకు రాజకీయాల కోసం ఇలాంటి తీర్పుకు మద్దతు తెలిపాయన్నారు. దీనిపై సుప్రీంకోర్టులో కేసు వేస్తామని చెప్పారు. రెండు తెలుగు రాష్ట్రాల ఎంపీలు పార్లమెంట్లో వర్గీకరణకు మద్దతు తెలిపితే వారి ఇళ్ల ముట్టడికి పిలుపునిస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు టి.శివయ్య, బి.అంబేద్కర్, ఎ.కరుణాకర్, జి.బాల, కె.విజయ్ పాల్గొన్నారు.

అన్న క్యాంటీన్ పనుల పరిశీలన

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

పేదలకు పట్టెడన్నం పెట్టేందుకు చంద్రబాబు ఏర్పాటు చేసిన అన్న క్యాంటీన్లను జగన్మోహన్‌రెడ్డి రద్దు చేశారని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ విమర్శించారు. పట్టణంలోని తాలూకా సెంటర్లో అన్న క్యాంటీన్ భవనాన్ని ఎమ్మెల్యే గురువారం సందర్శించి పనులను పరిశీలించారు. రాష్ట్ర వ్యాప్తంగా అగస్టు 15 అన్న క్యాంటీన్లను ప్రారంభిస్తున్నామని చెప్పారు.

కబడ్డీలో 'నారాయణ' విద్యార్థులకు పతకాలు

ప్రజాశక్తి - చిలకలూరిపేట

సౌత్‌జోన్ స్కూల్ కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో గతనెల 27, 28 తేదీల్లో విశాఖపట్నం జిల్లా పాడేరులో జరిగిన అండర్-14 పోటీల్లో పట్టణానికి చెందిన నారాయణ విద్యాసంస్థల విద్యార్థులు ఎం.పూజిత్, ఎం.సీతారామనాయక్ ప్రథమ స్థానం సాధించారని హెచ్ఎం కె.శేషగిరిరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అండర్-17 విభాగంలో జి.వంశీ, కె.రవితేజ, పి.హేమంత్ ద్వితీయ స్థానంలో నిలిచారన్నారు. ఈ మేరకు క్రీడాకారుల అభినందన సభ గురువారం పాఠశాలలో నిర్వహించారు. ఎజిఎం లక్ష్మణరెడ్డి, పిఇటి కృపారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణపై సుప్రీం తీర్పునకు హర్షం

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా సుప్రీం కోర్టు గురువారం తీర్పునిచ్చిన సందర్భంగా రొంపిచర్ల మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో మాజీ ఎంపిపి ఎం.రామారావు ఆధ్వర్యంలో సిఎం చంద్రబాబు, ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపకులు మందా కృష్ణ మాదిగ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు.

రొంపిచర్లలో చంద్రబాబు, కృష్ణమాదిగ చిత్రపటాలకు పాలాభిషేకం

ప్రజాశక్తి - చిలకలూరిపేట

ఎస్సీ వర్గీకరణ కోసం మూడు దశాబ్దాల పైగా చేసిన పోరాటాలు ఫలించాయని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు అడపా మోహన్ మాదిగ అన్నారు. స్థానిక ఎన్ఆర్‌టి సెంటర్లోని కార్యాలయంలో గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పుపై హర్షం వ్యక్తం చేశారు. లక్షలాది మంది మాదిగలకు, 59 ఉప కులాలకు మేలు జరగబోతుందని తెలిపారు. ఎస్సీ, ఎస్టీలకు రిజర్వేషన్లలో క్రీమిలేయర్ ప్రవేశ పెట్టాలని, తద్వారా ఎస్సీ, ఎస్టీల్లోని నిజమైన పేదలకు రిజర్వేషన్ ఫలితాలు అందుతాయనే భావనతో తాము ఏకీభవిస్తున్నట్లు చెప్పారు. సుప్రీం కోర్టు తీర్పును ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వెంటనే అమలు చేయాలన్నారు.

ప్రజాశక్తి - బెల్లంకొండ

ఎస్సీ వర్గీకరణ కోసం మంద కృష్ణమాదిగ నాయకత్వంలో సాగిన పోరాటానికి న్యాయం జరిగిందని బెల్లంకొండ సర్పంచ్ గడ్డిపతి జ్యోతి సముద్రం అన్నారు. ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా సుప్రీంకోర్టు తీర్పునిచ్చిన సందర్భంగా గురువారం సర్పంచ్ మాట్లాడుతూ ఎంఆర్‌పిఎస్ ఉద్యమానికి ఊపిరి పోసిన ఘనత మంద కృష్ణ మాదిగకే దక్కుతుందన్నారు.

8న స్కూల్ మేనేజ్మెంట్ ఎన్నికలు

ప్రజాశక్తి - పెదకూరపాడు : మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో స్కూల్ మేనేజ్మెంట్ కమిటీల ఎన్నికలు 8వ తేదీన జరుగుతాయని ఎంఇఒ ఏకుల ప్రసాదరావు తెలిపారు. గురువారం పాఠశాలలో ఎన్నికల నోటిఫికేషన్, ఓటర్ల జాబితాను విడుదల చేశారు. ఓటర్ల జాబితాపై అభ్యంతరాలుంటే 5వ తేదీలోగా సంబంధిత పాఠశాల హెచ్ఎంకు తెలపాలని సూచించారు.

మధ్యాహ్నం భోజనం పంపిణీ

ప్రజాశక్తి - పెదకూరపాడు

మండలంలోని 75 తాళ్లూరు జెడ్పి పాఠశాలలో గురువారం మధ్యాహ్న భోజనాన్ని టిడిపి నాయకులు పంపిణీ చేశారు. టిడిపి మండల అధ్యక్షులు ఎ.రమేష్, నాయకులు జి.బాబురావు, జె.ప్రసాదు, సుందర్ రామిరెడ్డి, వై.శ్రీను, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

విధుల్లోకి నూతన తహశీల్దార్లు

ప్రజాశక్తి - వినుకొండ

మండలం తహశీల్దార్‌గా ఎస్.సురేష్ గురువారం బాధ్యతలు చేపట్టారు. ఈయన గతంలో శావల్యాపురం మండలంలో జూనియర్ అసిస్టెంట్, ఆర్ఐగా, రెంటచింతల, సత్తెనపల్లి మండలాల్లో తహశీల్దార్‌గా పనిచేశారు. నూతన తహశీల్దార్‌కు కార్యాలయ సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు. మండల, పట్టణ డీలర్ల సంఘం సత్కరించింది. ఎం.సుబ్బారావు, ఎస్.వెంకట్ నారాయణ, జి.రాందాస్, ఎ.గోవిందు, షేక్ బుజ్జి, అక్కయ్య, సౌదాగర్ జానీ, సంగమేశ్వరరావు, త్రిపురారావు, జె.శ్రీను పాల్గొన్నారు.

ప్రజాశక్తి - పెదకూరపాడు

నూతన తహశీల్దార్‌గా మీసాల డానియల్ గురువారం బాధ్యతలు చేపట్టారు. ఈయన గతంలో పెదకాకాని, గురజాల తహశీల్దార్‌గా పనిచేశారు. ఈయనకు కార్యాలయ సిబ్బంది, వివిధ పార్టీల నాయకులు శుభాకాక్షలు తెలిపారు.

ప్రజాశక్తి - కారంపూడి

తహశీల్దార్‌గా బి.వి.ఆర్.సి.హెచ్ ప్రసాద్ గురువారం బాధ్యతలు చేపట్టారు. ఈయన గతంలో మాచవరం తహశీల్దార్‌గా పనిచేస్తూ ఎన్నికల విధుల్లో భాగంగా తిరుపతి జిల్లాకు బదిలీ అయ్యారు. నూతన తహశీల్దార్ కార్యాలయ సిబ్బంది, విఆర్ఒలు, డిప్యూటీ తహసీల్దార్‌తో సమావేశమయ్యారు. రైతులు, విద్యార్థులకు జారీ చేయాల్సిన ధ్రువపత్రాలపై ప్రత్యేక చొరవ చూపాలన్నారు.

ప్రజాశక్తి - అచ్చంపేట

తహశీల్దార్ జి.శ్రీనివాస్ బాధ్యతలు చేపట్టారు ఈయన గతంలోకారంపూడి, బొల్లాపల్లి, వెల్దుర్తి, బెల్లంకొండ మండలాలకు తహశీల్దార్‌గా పని చేశారు. ఎన్నికల సందర్భంగా తిరుపతి జిల్లా దక్కలికి బదిలీ అయ్యారు. తాజా బదిలీల్లో అచ్చంపేటకు వచ్చారు. విధుల్లో చేరాగా మండల పరిధిలోని మాదిపాడులోని ఇసుక డంపును పరిశీలించారు. 45 వేల టన్నులు ఇసుక ఉందని, జిల్లా కలెక్టర్ ఆదేశానుసారం ఇసుక లోడింగ్ నిర్వహిస్తామని చెప్పారు. ఎవరైనా ఇసుక అక్రమ రవాణాకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ప్రజాశక్తి-పిడుగురాళ్ల

నూతన తహశీల్దార్‌గా మధుబాబు భాద్యతలు స్వీకరించారు. ఈయన గతంలో నూజెండ్ల తహశీల్దార్‌గా పని చేశారు. ఎన్నికల సందర్భంగా ప్రకాశం జిల్లాకు బదిలీ అయ్యారు. ఇప్పటి వరకూ ఇక్కడ పని చేసిన శ్యామ్‌సుందర్ రాజా బదిలీపై నెల్లూరు జిల్లాకు వెళ్లారు.

పింఛన్ల పంపిణీలో ప్రజాప్రతినిధులు, అధికారులు

గుంటూరులో పెన్షన్లు అందచేస్తున్న కలెక్టర్

కొల్లిపరలో పెన్షన్లు అందచేస్తున్న మంత్రి నాదెండ్ల

వేజెండ్ల సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నరేంద్ర

దేవాపురంలో పెన్షన్లు పంపిణీ చేసిన కలెక్టర్

ప్రజాశక్తి-గుంటూరు

రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఎన్‌టిఆర్ భరోసా పెన్షన్లను గుంటూరు జిల్లాలో గురువారం ఉదయం 6 గంటల నుండి లబ్దిదారులకు నగదు పంపిణీ ప్రారంభించారు. ఈక్రమంలో జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి గురువారం ఉదయం గుంటూరు నగరంలోని దేవాపురం కాలనీలోని 120వ సచివాలయం పరిధిలో పెన్షన్ల పంపిణీని పరిశీలించారు. స్వయంగా జిల్లా కలెక్టర్ ఐదుగురు లబ్దిదారులకు వారి ఇంటి వద్దే నగదు అందించారు. వికలాంగులకు ఇచ్చే పెన్షన్ రూ.6వేలు లబ్దిదారు సీతమ్మకు, ఓల్డ్ ఏజ్ పెన్షన్ రూ.4వేలు లబ్దిదారు రామక్రిష్ణ , యాదమ్మ , నాగమల్లేశ్వర రావుకు అందించారు. వితంతు పెన్షన్ క్రింద రూ.4వేలు లక్ష్మీ జయశ్రీకి కలెక్టర్ అందిచారు. ఈ కార్యక్రమంలో డిఆర్డీఏ పిడి హరిహరనాథ్, జిఎంసి డిప్యూటీ కమిషనర్లు వెంకటలక్ష్మి, శ్రీనివాసులు, పశ్చిమ గుంటూరు తహశీల్దార్ ఫణీంద్ర తదితరులు పాల్గొన్నారు.

మంగళగిరిలో పాల్గొన్న ఎమ్మెల్సీ అనురాధ

ప్రజాశక్తి - మంగళగిరి

ఎన్టీఆర్ భరోసా ద్వారా దేశంలోనే అత్యధికంగా పింఛన్‌ను లబ్ధిదారులకు అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుదేనని ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధ అన్నారు. మంగళగిరి నియోజకవర్గంలో గురువారం వేకువజాము నుంచే కూటమి నాయకులు, కార్యకర్తలు పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. మంగళగిరి పట్టణంలోని కొత్తపేట, ఆంజనేయకాలనీ, సాయినగర్‌లోని పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధ పాల్గొన్నారు. స్థానిక నాయకులు అధికారులతో కలిసి స్వయంగా లబ్ధిదారుల ఇళ్ల వద్దకే వెళ్లి ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీ చేశారు. వృద్ధులు, వితంతువులు, చేనేత కార్మికులకు రూ. 4 వేలు, దివ్యాంగులకు రూ. 6 వేలు, దీర్ఘకాలిక వ్యాధులు ఉన్నవారికి రూ. 10 వేలు, పూర్తిస్థాయిలో వైకల్యానికి గురైన వారికి రూ. 15 వేలు అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర అధికార ప్రతినిధి తమ్మిశెట్టి జానకీదేవి, పట్టణ ఉపాధ్యక్షులు గోవాడ దుర్గారావు, పట్టణ ప్రధాన కార్యదర్శి షేక్ రియాజ్, పట్టణ బీజేపీ అధ్యక్షులు కాండ్రు భాను కిషోర్, రాష్ట్ర బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి గుత్తికొండ ధనుంజయరావు, 1వ వార్డు అధ్యక్షులు సైనాధం శ్రీనివాసరావు, 2వ వార్డు అధ్యక్షులు సుఖమంచి గిరిబాబు, 1వ వార్డు ప్రధాన కార్యదర్శి పోలూరి బుజ్జి, 9వ వార్డు ప్రధాన కార్యదర్శి అనుమోలు శ్రీనివాసరావు, తాటి అన్వేష్, తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటికీ తాగునీటి కుళాయి

కొల్లిపరలో పింఛన్లు పంపిణీ చేసిన మంత్రి మనోహర్

ప్రజాశక్తి - కొల్లిపర

సంక్షేమ కార్యక్రమాలకు ప్రభుత్వము పెద్ద పీట వేస్తుందని పౌరసరఫరాల శాఖ మాత్యులు నాదెండ్ల మనోహర్ అన్నారు. కొల్లిపర మండలంలో చక్రాయపాలెం, జముడుబాడు, దావులూరు, నాగరాజు పాలెం , తూములూరు, కొల్లిపర గ్రామాల్లో ఎన్టీఆర్ భరోసా పెన్షన్లను ఆయన పంపిణీ చేశారు. అనంతరం సభలో నాదెండ్ల మనోహర్ మాట్లాడారు. కొల్లిపర మండలంలో 9821 మంది 14 రకాల పెన్షన్‌దారులుగా ఉన్నారన్నారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరూ ప్రభుత్వ పథకాలకు దరఖాస్తు చేసుకోవచ్చున్నారు. రాష్ట్ర ప్రభుత్వము ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఉన్నా ప్రతి నెల మొదటి తారీకున పెన్షన్ల పంపిణీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. కొల్లిపర మండలంలో సంక్షేమంతో పాటు అభివృద్ధి చేసి చూపిస్తానన్నారు. ముఖ్యంగా రోడ్లు సైడ్ డ్రైన్లకు మొదటి ప్రాధాన్యత ఇస్తామన్నారు రక్షిత మంచినీటి పథకాన్ని మరింత మెరుగుపరుచుకునేందుకు రూ .కోటి 70 లక్షలు మంజూరు చేసినట్లు తెలిపారు. ప్రతి ఒక్క ఇంటికి మంచినీటి కులాయి ఏర్పాటు చేసేటట్లు చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం ప్రభుత్వ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తెనాలి సబ్ కలెక్టర్ ప్రాకార్ జైన్ ఎంపీడీవో విష్ణు ప్రసాద్ ఇన్చార్జి తాసిల్దార్ మూర్తి ఓఎస్డి ఏసురత్నం జనసేన మండల పార్టీ అధ్యక్షులు వెంకయ్య నాయుడు ఆ పార్టీ నాయకులు భీమవరపు వేణుగోపాల్ రెడ్డి భీమవరపు కిషోర్ రెడ్డి గుదిబంటి గోవర్ధన్ రెడ్డి నాయకులు కార్యకర్తలు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

వేజెండ్లలో పంపిణీ చేసిన ఎమ్మెల్యే నరేంద్ర

ప్రజాశక్తి - చేబ్రోలు

ఎన్‌డిఎ కూటమి ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర పాల్గొన్నారు. మండలంలోని వేజండ్ల గ్రామంలోని 1446 లబ్ధిదారులకు రూ. 6103500 పెన్షన్లను పింపిణీ చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో ఎమ్మెల్యే నరేంద్ర మాట్లాడారు. వేజండ్ల గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపించడానికి మొదటి దశగా రూ. 40 లక్షల అభివృద్ధి పనులు ప్రారంభిస్తామని తెలిపారు. ప్రతి కుటుంబం సంతోషంగా ఉండాలనేదే టిడిపి లక్ష్యం అన్నారు. ఒకటవ తేదీ ఉదయానే సామాజిక భద్రత పెన్షన్ లబ్ధిదారుల మొహాల్లో చిరునవ్వులు చూడాలన్న లక్ష్యంతో ప్రతి ఇంటికి వెళ్లి పెన్షన్ పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. అయితే గత ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇంటింటికి పెన్షన్ ఇచ్చే అవకాశం ఉన్నప్పటికీ బ్యాంకుల్లో వేసి లబ్ధిదారులను ఇబ్బంది పెట్టారని ప్రతిపక్షాలపై నెపం వేసి రాజకీయ లబ్ధి పొందటానికి వైసిపి ప్రభుత్వం ప్రయత్నించిందన్నారు. వైసిపి కుట్రలను గ్రహించి ప్రజలు కూటమి ప్రభుత్వానికి పట్టం కట్టినందుకు రుణపడి వుంటామని తెలియజేశారు. మాది పేదల ప్రభుత్వమని ప్రజలందరి కోసమే పని చేస్తామని అన్నారు. కార్యక్రమంలో ప్రత్యేక అధికారి ఏ లక్ష్మి కుమారి, నియోజకవర్గ ప్రత్యేక అధికారి వందనం, ఎంపిడిఓ కె జ్యోతి, ఈఓపిఆర్ ఆర్‌డి జి శ్రీనివాసరావు, పిఎస్ లు ప్రశాంతి, పద్మ, నోడల్ అధికారులు జి ప్రసాదరావు, డి మల్లికార్జున, చేబ్రోలు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు మైలా వెంకటరామరాజు, మండల జనసేన పార్టీ అధ్యక్షులు చందు శ్రీరాములు, రాష్ట్ర మైనార్టీ సెల్ అధికార ప్రతినిధి మోసిన్ తదితరులు పాల్గొన్నారు.

97 శాతం పింఛన్లు పంపిణీ

ప్రజాశక్తి - తుళ్లూరు

మండలంలో 97 శాతం ఫించన్లు పంపిణీ చేయడం జరిగిందని ఎంపిడిఓ శ్రీమన్నారాయణ తెలిపారు. గురువారం ఉదయం 5గంటలకు ఫించన్ల పంపిణీ మొదలైందని, సాయంత్రం 5 గంటలకు 95 శాతం మేర లబ్ధిదారులకు ఫించన్లు అందజేయడం జరిగిందన్నారు. 16,426 ఫించన్లకు గాను 14,492 మందికి నగదు పంపిణీ చేశామని, సాయంత్రం 7 గంటలకు 97 శాతం పూర్తవుతుందని ఆయన చెప్పారు. మిగిలిన 3 శాతం మందికి శుక్రవారం ఉదయానికి ఫించన్లు అందజేస్తామన్నారు. అదనంగా సిఆర్‌డిఎ ఫించన్లు 7,608 ఉండడంతో కొంత ఆలస్యం అయ్యిందని, మొత్తం 226 మంది ఉద్యోగులు, సిబ్బందితోనే ఫించన్లు అందజేయడం జరిగిందని చెప్పారు.

ప్రజాశక్తి-తెనాలిరూరల్

తెనాలి మండలంలోని, కొలకలూరు, గుడివాడ, కోపల్లె, అంగలకుదురు గ్రామాల్లో గురువారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆహార పౌరసరఫరాల మంత్రి నాదెండ్ల మనోహర్ ఎన్టిఆర్ భరోసా పింఛన్లను పంపిణీ చేశారు. స్థానిక సబ్ కలెక్టర్ ప్రఖర్ జైన్, మంత్రి ఓఎస్డి ఏసురత్నం, జనసేన, టిడిపి, బిజెపి కార్యకర్తలు వారివెంట ఉన్నారు.



పట్టాభిపురం సిఐగా కిరణ్

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరు పట్టాభిపురం సిఐగా పి.కిరణ్ గురువారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు విఆర్‌లో ఉన్న ఆయన్ను పట్టాభిపురం సిఐగా నియమిస్తూ రేంజి ఐజి త్రిపాఠి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈమేరకు ఆయన బాధ్యతలు స్వీకరించారు. శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని తెలిపారు.

తుళ్లూరు ఎంఇఒకు సన్మానం

ప్రజాశక్తి - తుళ్లూరు

మండల విద్యాశాఖాధికారిగా మహబూబ్ సుభాని గురువారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ మండల శాఖ ఎంఇఓ కు అభినందనలు తెలిపింది. మండల విద్యా వనరుల కేంద్రంలో యూటీఎఫ్ మండల అధ్యక్షులు పి వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి టి భాస్కర రావు, జిల్లా నాయకులు అడివి శ్రీనివాసరావు, సిహెచ్ ఆది నారాయణ,తదితరులు ఎంఇఓకు శాలువా కప్పి సత్కరించారు. కార్యక్రమంలో ఇంచార్జి ఎంఇఓ - 2 కె ప్రభాకరరావు పాల్గొన్నారు.

ఎంఇఓను సత్కరిస్తున్న యుటిఎఫ్ నాయకులు

జిఎస్‌టి అప్పీల్స్ అడిషనల్ కమిషనర్‌గా సౌమ్య

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరులోని జి ఎస్ టి, కస్టమ్స్ అప్పీల్స్ కమిషనరేట్ కార్యాలయ అడిషనల్ కమిషనర్ గా నూతలపాటి సౌమ్య నియమితులయ్యారు. ఈమె విజయవాడలోని కస్టమ్స్ ప్రధాన కార్యాలయంలో అడిషనల్ కమిషనర్ గా విధులు నిర్వహిస్తూ, బదిలీపై గుంటూరుకు రానున్నారు. గుంటూరు అప్పీల్స్ కమిషనరేట్ కార్యాలయంలో అదనపు కమిషనర్ గా బాధ్యతలు నిర్వహిస్తున్న ఎన్.మధుసూదనరెడ్డి ని, గుంటూరు సెంట్రల్ జి ఎస్ టి కమిషనరేట్ కార్యాలయంలో అదనపు కమిషనర్ గా నియమించారు. జి ఎస్ టి, కస్టమ్స్ కేసులకు సంబంధించిన అప్పీల్స్ కమిషనరేట్ కార్యాలయం రాష్ట్రంలో ఒక్క గుంటూరులోనే ఉంది.

మాట్లాడుతున్న బాజిబాబు, లక్ష్మణరావు నాగుల్‌మీర నాయకులు

గ్రామ రెవెన్యూ సహాయకుల సామూహిక వినతులను జయప్రదం చేయండి

ప్రజాశక్తి - గుంటూరు

గ్రామ రెవెన్యూ సహాయకుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఆగష్టు 3వ తేదీన మండల తహసిల్దారులకు, 7వ తేదీ ఆర్డీవోలకు వినతి పత్రాలు కార్యక్రమంలో ప్రతి ఒక్క విఆర్‌ఏ పాల్గొనాలని ఏపీ గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం గుంటూరు జిల్లా అధ్యక్షులు వడ్డే బాజీ బాబు పిలుపునిచ్చారు. గురువారం స్థానిక సిఐటియు కార్యాలయంలో జరిగిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వీఆర్‌ఏలకు గత అనేక పోరాటల ఫలితంగా రాత్రి విధులు నిర్వహణ వేయకూడదని నిబంధన ఉన్న వేరువేరు కారణాలు చెప్పి డ్యూటీలు వేయటం సరికాదని వీటిని తక్షణమే వెనుకు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. వీటితోపాటు పేస్కేలు, నామినీల సమస్యలు పరిష్కరించాలని ఏపీ గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా సామూహక వినతి పత్రాల కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఏ ప్రతి ఒక్క విఆర్‌ఏ ఈ కార్యక్రమాల్లో భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో జిల్లా గౌరవ అధ్యక్షులు బి లక్ష్మణరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ నాగులమీరా తదితరులు పాల్గొన్నారు.

హరికిషన్ సింగ్ సూర్జిత్‌కు ఘన నివాళి

ప్రజాశక్తి - పెదనందిపాడు రూరల్

కమ్యూనిస్టు ఉద్యమ నేత, స్వాతంత్ర్య సమరయోధుడు హరికిషన్ సింగ్ సూర్జిత్ 16వ వర్ధంతి సందర్భంగా గురువారం పెదనందిపాడు తేళ్ళ నారాయణ విజ్ఞాన కేంద్రం లో సిపిఎం నాయకులు ఘనంగా నివాళులర్పించారు. తొలుత సూర్జిత్ చిత్ర పటానికి మండల కార్యదర్శి దొప్పలపూడి రమేష్ బాబు, సీనియర్ నాయకులు జంపని రామారావు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా రమేష్ బాబు మాట్లాడుతూ సూర్జిత్ తన 12 సంవత్సరాల వయస్సులోనే బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా వీరోచితంగా పోరాడారని అన్నారు. ఆయన తన జీవితాన్ని సామాన్య ప్రజల కోసం అంకితం చేశారన్నారు.10 సంవత్సరాల జైలు జీవితం, 8 సంవత్సరాల రహస్య జీవితం గడిపారని అన్నారు.సభలో చుక్కా యానాదులు, పాటిబండ్ల సాంబశివరావు, సాయి బాబు, కె.లక్ష్మి, పుష్పావతి ,పలువురు మహిళలు పాల్గొన్నారు.

బాధ్యతలు చేపట్టిన నూతన తహశీల్దార్లు

ప్రజాశక్తి సత్తెనపల్లి రూరల్

సత్తెనపల్లి మండల తహసీల్దార్ గా కె.ఎస్ చక్రవర్తి గురువారం బాధ్యతలు స్వీకరించారు. పిడుగురాళ్ల తహసిల్దార్ గా పనిచేస్తున్న చక్రవర్తి బదిలీపై సత్తెనపల్లి తహసిల్దార్ గా నియమితులయ్యారు. గతంలో చక్రవర్తి సత్తెనపల్లి పౌరసరఫరాల శాఖ డీటిగా పనిచేశారు.భాధ్యతలు చేపట్టేందుకు వచ్చిన నూతన తహసిల్దార్ చక్రవర్తికి కార్యాలయ సిబ్బంది పుష్పగుచ్చాలు అందచేసి ఘన స్వాగతం పలికారు.

ప్రజాశక్తి - నకరికల్లు

నకరికల్లు మండల తాహసిల్దారుగా కట్టెకోట. పుల్లారావు పదవీ బాధ్యతలను గురువారం స్వీకరించారు. గతంలో నాదెండ్ల, మాచవరం , శావల్యాపురం రెంటచింతల మండలాల్లో పనిచేశారు. మండలంలోని ప్రజలకు రెవెన్యూ సేవలను సత్వరమే అందేలా చర్యలు తీసుకుంటానన్నారు. తహసిల్దార్ పుల్లారావును కార్యాలయ సిబ్బంది, వీఆర్వోలు పూలమాలలు వేసి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

బిడ్డ ఆరోగ్యానికి తల్లిపాలే ముఖ్యం

ప్రజాశక్తి - చిలకలూరిపేట

బిడ్డ ఆరోగ్యానికి తల్లిపాలు ఎంతో ముఖ్యమని పలువురు వైద్యులు చెప్పారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా గురువారం ఇన్నర్‌వీల్ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక ఏరియా ఆసుపత్రిలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ లక్ష్మీకుమారి, క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు జి.సరోజిన, ఎన్.జయలక్ష్మి, మాజీ అధ్యక్షులు టి.రమాదేవి కలిసి పోస్టర్‌ను ఆవిష్కరించారు. డాక్టర్ సత్యదీప్తి, డాక్టర్ సుప్రజ, డాక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ బిడ్డలకు రోగాలు రాకుండా కాపాడటంలో తల్లిపాలు కీలకమన్నారు. నవజాత శిశువులకు పాలు పట్టడం ద్వారా తల్లికీ మేలని, రొమ్ము కేన్సర్, అండాశయ కేన్సర్ వచ్చే అవకాశాలు తగ్గుతాయని తెలిపారు. అనంతరం గర్భిణులు, బాలింతలకు రొట్టెలు, పండ్లు పంపిణీ చేశారు.

ప్రజాశక్తి - విజయపురిసౌత్

మాచర్ల మండలం కొప్పునూరు అంగన్వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. తల్లిపాల ప్రాధాన్యంపై గర్భిణులు, బాలింతలకు వివరించారు. డాక్టర్ ముక్తియార్ జానీ, సిడిపిఒ లీలావతి, సూపర్వైజర్ లీలావతి, అంగన్వాడీ టీచర్ సరళ పాల్గొన్నారు.

స్కూల్ మేనేజ్మెంట్ కమిటీల ఎన్నికల నోటిఫికేషన్

ప్రజాశక్తి - క్రోసూరు

మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో స్కూల్ మేనేజ్మెంట్ కమిటీల ఎన్నికల నిర్వహణకు ప్రతి పాఠశాలలో ఎన్నికల నోటిఫికేషన్‌ను గురువారం విడుదల చేసినట్లు ఎంఇఒ-1 ఏకుల ప్రసాదరావు, ఎంఇఒ-2 గణేష్ తెలిపారు. పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం, మౌలిక సదుపాయాలు రూపకల్పనకు ఈ కమిటీకి అప్పగించనున్నట్లు చెప్పారు.

కోలాహలంగా సామాజిక పింఛన్ల పంపిణీ

ప్రజాశక్తి-పల్నాడు జిలా

లబ్ధిదార్లకు సామాజిక పింఛన్ల పంపిణీని గురువారం పల్నాడు జిల్లా వ్యాప్తంగా వేడుకల్లా చేపట్టారు. ఆయా కార్యక్రమాల్లో జిల్లా కలెక్టర్‌తోపాటు ఎమ్మెల్యేలు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొని పింఛను సొమ్మును లబ్ధిదార్లకు ఇచ్చారు. ఇందులో భాగంగా రొంపిచర్ల మండలం, అలవాలలో పింఛను పంపిణీని పల్నాడు జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు ప్రారంభించారు. నరసరావుపేట మండలం ములకలూరులో ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు పింఛన్లను పంపిణీ చేశారు. పథక సంచాలకులు బాలునాయక్, ఎంపిఎం భరత్, సచివాలయం సిబ్బంది, స్థానిక ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - చిలకలూరిపేట

పట్టణంలోని 19, 12, 11 వార్డులు, మండలంలోని వేలూరు, కుక్కపల్లివారిపాలెం, యడ్లపాడు మండలంలోని సందెపూడి, జాలాది, నాదెండ్ల మండలం చందవరం, సాతులూరు గ్రామాల్లో పింఛన్ల పంపిణీలో ఎమ్మెల్యే పత్తిపాటి పుల్లారావు, జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి టి.రాజారమేష్ పాల్గొన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ 96 శాతం లబ్ధిదార్లకు ఒక్కరోజులోనే పంపిణీ చేశామని తెలిపారు. గుప్పించారు.

ప్రజాశక్తి - వినుకొండ

పట్టణంలోని హనుమాన్ నగర్‌లో పింఛన్ల పంపిణీని ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు ప్రారంభించారు. తొలిరోజే 99 శాతం మందికి పింఛను అందించామన్నారు. పెన్షన్ పథకాన్ని ప్రవేశపెట్టింది ఎన్‌టిఆర్ కాగా దాన్ని రూ.200 నుండి రూ.2 వేలకు పెంచింది చంద్రబాబు అని చెప్పారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు, జనసేన నియోజకవర్గ సమన్వయకర్త కె.నాగశ్రీను రాయల్, నాయకులు ఎన్.శ్రీనివాసరావు, ఎం.రమేష్, పి.అయూబ్‌ఖాన్, సౌదాగర్ జానీబాష, లింగమూర్తి, సురేష్‌బాబు పాల్గొన్నారు

ప్రజాశక్తి-ఈపూరు

మండల కేంద్రమైన ఈపూరులో పింఛన్ల పంపిణీలో ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు పాల్గొన్నారు. తొలుత స్థానిక సెంటర్లోని ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మండల ప్రత్యేకధికారి సిహెచ్ వెంకటరమణారెడ్డి, ఎంపిడిఒ ఎవి రంగనాయకులు, టిడిపి జిల్లా అధికార ప్రతినిధి ఆర్.జగ్గారావు, మండల అధ్యక్షులు టి.బాలయ్య, నాయకులు ఎ.కోటేశ్వరరావు, బి.సైదులు, మురళి, మల్లయ్య, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

సత్తెనపల్లిలోని 10వ వార్డు నాగార్జున నగర్, మడలంలోని నాగార్జున నగర్‌లో పింఛన్ల పంపిణీలో ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ హాజరయ్యారు. నాయకులు వై.రామస్వామి, డి.నాగేశ్వరరావు, ఎ.నాగేశ్వరరావు, బుడే , కె.వెంకటేశ్వరరావు, ఎ.అమరేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - మాచర్ల

పట్టణంలో పింఛన్ల పంపిణీనికి ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి హాజరవగా నాయకులు వై.మల్లికార్జునరావు, వై.కేశవరెడ్డి, మదార్‌సాహెబ్, కె.దుర్గారావు, ఎం.సీతారెడ్డి, కె.అనిల్‌కుమార్ పాల్గొన్నారు.



ప్రజాశక్తి - పెదకూరపాడు

మండలంలోని హుస్సేనగరంలో పెన్షన్ల పంపిణీకి ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్, టిడిపి పల్నాడు జిల్లా అధ్యక్షులు కొమ్మాలపాటి శ్రీధర్ హాజరయ్యారు. పల్నాడు జిల్లా పంచాయతీ రాజ్ డిప్యూటీ సీఈవో మోహన్‌రావు, మండల ప్రత్యేకాధికారి నాగలక్ష్మి, ఎంపిడిఒ మల్లేశ్వరి, పెదకూరపాడు సర్పంచ్ జి.రాజు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - అమరావతి

మండలంలోని దిడుగులో పింఛన్లను ఎమ్మెల్యే ప్రవీణ్ పంపిణీ చేసి లబ్ధిదార్లతో మాట్లాడారు. గత ప్రభుత్వంలో తొలగించిన లబ్ధిదార్లను సర్వే చేసి వారికీ పింఛను వచ్చేలా కృషి చేస్తానని చెప్పారు. టిడిపి మండల అధ్యక్షులు ఎం.విష్ణు, ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - క్రోసూరు

మండలంలో 8,701 మందికి గాను రూ.3,75,25000 పింఛను మొత్తాన్ని లబ్ధిదార్లకు నూరుశాతం పంపిణీ పూర్తి చేశామని ఎంపిడిఒ వెంకటరమణ తెలిపారు. బయ్యవరంలో పింఛన్ల పంపిణీకి ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ హాజరవగా, ఆయన భార్య లావణ్య క్రోసూరులోని చెంచు కాలనీలో పింఛన్లు పంపిణీ చేశారు. నాయకులు జి.బాషా, మస్తాన్, కరీముల్లా, కోటేశ్వరరావు, సలాం, వెంకట్రామిరెడ్డి పాల్గొన్నారు.

ప్రజాశక్తి-పిడుగురాళ్ల

పట్టణంలో 98 శాతం పైగా ఫించన్ల పంపిణీ పూర్తి చేసినట్లు మున్సిపల్ కమిషనర్ గిరికుమార్ తెలిపారు. పట్టణంలో 6,700 మందికి గాను 6,583 మందికి ఫించన్లు అందించామన్నారు. 117 ఫించన్ల మాత్రమే మిగిలి ఉన్నాయని తెలిపారు. పట్టణంలో ప్రతి నెల ఫించన్ల కింద రూ.2,91,54,000 పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు.

జల్‌శక్తి అభియాన్ అమలుపై నివేదిక రూపొందించండి

త్వరలో నోడల్ అధికారి పర్యటన నేపథ్యంలో పల్నాడు కలెక్టర్ సమీక్ష

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

జల్‌శక్తి అభియాన్ పథకం ద్వారా జిల్లాలో చేపట్టిన కార్యక్రమాలపై వాస్తవ నివేదిక రూపొందించాలని డ్వామా పీడీ జోసెఫ్ కుమార్‌ను పల్నాడు జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు ఆదేశించారు. ఈనెల 2వ వారంలో జల్ శక్తి అభియాన్ కేంద్ర నోడల్ అధికారి సాల్మన్ ఆరోగ్య రాజ్ జిల్లా పర్యటన నేపథ్యంలో పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేట కలెక్టరేట్‌లో అధికారులతో కలెక్టర్ గురువారం సమీక్షించారు. జల్ శక్తి అభియాన్ కార్యక్రమాల అనంతరం జిల్లాలో పెరిగిన భూగర్భ జలాలు, అటవీకరణ - పచ్చదనం గణాంకాలను నివేదికలో స్పష్టంగా పొందుపరచాలన్నారు. నోడల్ అధికారి పర్యటన ఆద్యంతం చెరువుల నవీకరణ, ఫారం పాండ్ల నిర్వహణ, గ్రామాల్లో జల్ జీవన్ మిషన్ ద్వారా మంచినీటి సరఫరా, ప్రభుత్వ కార్యాలయాల్లో నీటి నిర్వహణ వంటి కార్యక్రమాల వివరాలు ముందుగానే సిద్ధం చేసి ఉంచాలన్నారు. జిల్లా వ్యాప్తంగా చేపట్టిన కార్యక్రమాలతో కలెక్టరేట్ లోని జాషువా సమావేశ మందిరంలో ఫొటో ఎగ్జిబిషన్ ఏర్పాటు చేయాలన్నారు. సీడ్ బాల్స్ క్యాంపెయిన్‌లో నోడల్ అధికారిని భాగస్వామిని చేస్తూ వినుకొండ అటవీ ప్రాంతంలో 25,000 సీడ్ బాల్స్‌తో అటవీకరణ కార్యక్రమం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అటవీ అధికారి రామచంద్రరావు, ఆర్డబ్ల్యుఎస్ ఎస్ఇ సురేశ్, డీఆర్డీఎ పీడీ బాలునాయక్, జిల్లా ఉద్యాన అధికారి రమణారెడ్డి, డీఎంహెచ్ఓ రవి, జిల్లా భూగర్భ జల అధికారి టి.ఎస్.శర్మ, మైనర్ ఇరిగేషన్ డిఈ శ్రీనివాసరావు, నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ ఎస్ఇ వరలక్ష్మి, డీపీఆర్వో ఓంప్రకాశ్‌రెడ్డి పాల్గొన్నారు.

ఉర్దూ స్కూలులో పరిశీలిస్తున్న ఎమ్మెల్యే అరవిందబాబు

రెండుపూటలా తాగునీరివ్వాలి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

నరసరావుపేట పట్టణంలో ఇకపై ఏ ఒక్కరూ తాగునీటి గురించి ఫిర్యాదు చేసే అవకాశం ఉండకూడదని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు అన్నారు. తాగునీటి సమస్యపై మున్సిపల్ కమిషనర్ ఆర్డబ్ల్యుఎస్ అధికారులతో గురువారం ప్రత్యేక పరిశీలన చేపట్టారు. పట్టణంలోని ప్రతి ఇంటికి రెండు పూటలా తాగునీరు సరఫరా చయాలని, పైపులైన్లు నిత్యం పరిశీలించాలని చెప్పారు. పలుచోట్ల మురికి కాలువల సమీపంలో తాగునీటి పైపులైన్లు ఉన్నాయని ఫిర్యాదులు వచ్చాయని, వాటిని తక్షణమే పరిష్కరించాలని చెప్పారు. ఇదిలా ఉండగా మండలంలోని ములకలూరు ఉర్దూ పాఠశాలను ఎమ్మెల్యే ఆకస్మికంగా పరిశీలించారు. ఇస్సపాలెంలో స్త్రీ శక్తి భవనాన్ని పరిశీలించారు. సదుపాయాల్లేక అధ్వానంగా ఉన్న భవనాల్లో స్త్రీలు ఎలా పని చేయగలరని ప్రశ్నించారు. మహిళలు స్వచ్ఛందంగా ఆర్థిక లావాదేవీలు నిర్వహించుకునేందుకు వీలుగా గతంలో చంద్రబాబు స్త్రీ శక్తి భవనాలకు శ్రీకారం చుట్టారన్నారు. అదే సమయంలో మహిళలకు శిక్షణా తరగతులు, సంయుక్త సమావేశాలు నిర్వహించుకునేందుకు వీలుగా నిర్మించిన భవనాలను జగన్మోహన్‌రెడ్డి అధ్వానంగా మార్చారని విమర్శించారు.

జిందాల్ ప్లాంట్‌ను సందర్శించిన నగర కమిషనర్

ప్రజాశక్తి-గుంటూరు

ఘన వ్యర్థాల నిర్వహణ పకడ్బందీగా, ప్రణాళికాబద్ధంగా చేపట్టినప్పుడే రోజువారి ఉత్పత్తి అవుతున్న వ్యర్థాల సమస్యకు పరిష్కారం లభిస్తుందని నగర కమిషనర్ (ఎఫ్‌ఎసి) ఎస్.హరికృష్ణ అన్నారు. గురువారం నాయుడుపేటలోని జిందాల్ అర్బన్ వేస్ట్ మేనేజ్మెంట్ ప్లాంట్‌ని ఇంజినీరింగ్ అధి కారులతో కలిసి పరిశీలించారు.ఈ సంద ర్భంగా కమిషనర్ తొలుత జిందాల్ ప్రతినిధులతో ప్లాంట్ సామర్థ్యం, అవసరమైన వ్యర్థాలు, ఏ మున్సిపాల్టీల నుండి ఎంత చెత్త వస్తుంది, ఎంత విద్యుత్ ఉత్పత్తి అవుతుంది తదితర వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా

ప్లాంట్‌ను పరిశీలిస్తున్న కమిషనర్

కమిషనర్ మాట్లాడుతూ ప్రస్తుతం ప్రతి నగరపాలక సంస్థ, మున్సిపాలిటీల్లో వ్యర్థాల నిర్వహణ పెద్ద సమస్యగా ఉందని, ఉత్పత్తి అవుతున్న వ్యర్థాలను ఒక చోట డంప్ చేయడం ద్వారా స్థలాభావం సమస్య కూడా ఎదురవు తుందన్నారు. వేస్ట్ మేనేజ్మెంట్ ప్లాంట్ ద్వారా వ్యర్థాల నిర్వహణ తేలిక అవుతుందన్నారు. అలాగే జిందాల్ ప్లాంట్‌కు ఇతర మున్సిపాలిటీలు, నగర పాలక సంస్థల నుండి వ్యర్థాలు తరలిస్తున్నా, గుంటూరు నగరపాలక సంస్థ ప్రధానంగా ఉంటుందన్నారు. కనుక ప్రజారోగ్య సిబ్బంది గుంటూరు లక్ష్యానికి అనుగుణంగా ప్రతి రోజు 320 టన్నుల వ్యర్థాలను జిందాల్ ప్లాంట్ కు తరలించాలన్నారు. కార్యక్రమంలో ఈఈ కొండారెడ్డి, డిఈఈ సతీష్, ఏఈ రవికిరణ్, సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ స్పెషలిస్ట్ అనిల్‌కుమార్, జిందాల్ ప్లాంట్ డిజిఎం ఎస్.సి.రాయుడు, సీనియర్ మేనేజర్ బి.శ్రీనివాసరావు, మేనేజర్ ఎస్.భార్గవ పాల్గొన్నారు.

పైపులైను రిపేరు

ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి-తాడేపల్లి

స్థానిక నెహ్రూ బొమ్మ సెంటర్‌లోని కన్నమ్మ హోటల్ ఎదురుగా మెయిన్ పైపులైన్ లీకేజీ అయ్యి మంచినీరు వృథాగా పోతుంది. వృథాగా పోతున్న మంచినీరు శీర్షికన ప్రజాశక్తిలో ప్రచురితమైన వార్త కథనంపై అధికారులు స్పందించారు. లీకవుతున్న పైపులను రిపేరు చేసి మంచినీరు యధావిధిగా ప్రజలకు అందే విధంగా తగిన చర్యలు తీసుకున్నారు.

సుప్రీం తీర్పు చారిత్రాత్మకం : మేడ్

ప్రజాశక్తి-గుంటూరు

సుప్రీం కోర్టు ఎస్సీ వర్గీకరణ చేసుకొనే అధికారం రాష్ట్రాలకు ఉందని ఇచ్చిన తీర్పు చారిత్రాత్మకమైందని, మోడల్ అసోసియేషన్ ఆఫ్ దళిత్ ఎంప్లాయీస్ (మేడ్) రాష్ట్ర అధ్యక్షులు మురికిపూడి దేవపాల్ ఒక ప్రకటనలో పేర్కొ న్నారు. 30 సంవత్సరాల సుధీర్ఘ పోరాటం ద్వారా ఈ చారిత్రాత్మక విజయాన్ని మాదిగ జాతికి అందించిన కృష్ణ మాదిగ అభినందనీయులు అని అన్నారు. ప్రస్తుత ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వర్గీకరణకు మొదటి నుండి అనుకూలంగా ఉన్నందున సాధ్యమైనంత త్వరగా సుప్రీం కోర్టు తీర్పు అమలు పరచి మాదిగల జీవి తాలలో వెలుగులు నింపాలని కోరారు. ఈ విజయం ఎన్నో త్యాగాలు చేసిన ఎంఆర్‌పిఎస్ కార్యకర్తలకు అంకితం అన్నారు.

త్వరలో అన్న క్యాంటీన్ ప్రారంభం

ప్రజాశక్తి-తాడేపల్లి : తాడేపల్లి నులకపేటలోని ఎంపిడిఒ కార్యాలయం సమీపంలో ఈ నెల 15వ తేదీన అన్న క్యాంటీన్ ప్రారంభించడానికి అన్ని ఏర్పాట్లు జరుగు తున్నాయి. గత టిడిపి ప్రభుత్వ హయాంలో ఇదే ప్రాంతంలో అన్న క్యాంటీన్ నిర్వహించారు. ఆ తరువాత అధికారంలోకి వచ్చిన వైసిపి అన్న క్యాంటీన్లను నిర్వీర్యం చేసింది. అదే భవనంలో సచివాలయాన్ని నిర్వహించింది. ప్రస్తుతం మళ్లీ టిడిపి అధికారంలోకి రావడంతో అదే భవనంలో అన్న క్యాంటీన్‌ను నిర్వహిం చేందుకు తుది మెరుగుతు దిద్దుతున్నారు. మంత్రి నారా లోకేష్ నియోజకవర్గం కావడంతో ఘనంగా ప్రారంభించడానికి ఏర్పాట్లు జరుగుతున్నాయి.

రాష్ట్ర మహిళా కాంగ్రెస్ ఉపాధ్యక్షులుగా సుల్తానా

ప్రజాశక్తి - మంగళగిరి

రాష్ట్ర మహిళా కాంగ్రెస్ ఉపాధ్యక్షురాలుగా యర్రబాలెం గ్రామానికి చెందిన షేక్ సుల్తానాను నియమిస్తూ రాష్ట్ర మహిళా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు తాంతియా కుమారి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు గుంటూరులోని జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో గురువారం జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు లింగంశెట్టి ఈశ్వరరావు చేతుల మీదుగా సుల్తానా నియామక పత్రాన్ని అందుకున్నారు. ఈ కార్యక్రమంలో మంగళగిరి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి షేక్ సలీం, జిల్లా కాంగ్రెస్ పార్టీ కాపు సాధికారిక చైర్మన్ రేమినిశెట్టి హనుమంతరావు,

నియామక పత్రాన్ని అందుకుంటున్న సుల్తానా

మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కొప్పాకుల కష్టారావు చౌదరి, నియోజకవర్గ మహిళా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు షేక్ మున్ని తదితరులు పాల్గొన్నారు.

బాలోత్సవ బ్రోచర్లు పంపిణీ

ప్రజాశక్తి-తాడేపల్లి

మంగళగిరి తాడేపల్లి బాలోత్సవం ఆధ్వర్యంలో స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా తాడేపల్లి ఆశ్రమం రోడ్డులోని అమరావతి ఐకాన్‌లో ఈ నెల పదో తేదీన చిత్రలేఖనం పోటీలు నిర్వహిస్తున్నట్లు బాలోత్సవాల రాష్ట్ర బాధ్యులు పిన్నమనేని మురళీకృష్ణ, ఎంటిఎంసి కోశాధికారి గాదె సుబ్బారెడ్డి, అమరావతి ఐకాన్ మిత్రబృందం వై.బాలకృష్ణ, బాధ్యులు దుర్గి కోదండరామయ్య, బిట్రా రామారావు తెలిపారు. ఆ మేరకు తాడేపల్లి పట్టణం, రూరల్ గ్రామాల్లో గత నాలుగు రోజుల నుంచి వివిధ పాఠశాలల్లో బ్రోచర్లు పంపిణీ చేస్తున్నారు. మూడు అంశాల్లో పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. సబ్ జూనియర్స్ (3, 4, 5 తరగతులు) అంశం జెండా వందనం, జూనియర్స్ (6, 7 తరగుతులు) అంశం మీకిష్టమైన స్వాతంత్ర సమరయోధుడు, సీనియర్స్ (8, 9, 10 తరగతులు) అంశం స్వాతంత్ర్య ఉద్యమంలో ఏదైనా ఓ ఘట్టంపై పోటీలు ఉంటాయని తెలిపారు. పదో తేదీ శనివారం మధ్యాహ్న రెండు

నుంచి నాలుగు గంటల వరకు అమరావతి ఐకాన్ ఫంక్షన్ హాల్లో పోటీలు జరుగుతాయని చెప్పారు. అదే రోజు సాయంత్రం ఐదు గంటలకు విజేతలకు మెమెంటోలు, సర్టిఫికెట్లు అందజేయనున్నట్లు చెప్పారు. పోటీల్లో పాల్గొనే వారు ఈ నెల 7వ తేదీలోపు పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. పేర్లు నమోదు కోసం ఆర్.నాగరాజు, 9490099559 నెంబర్‌కు సంప్రదించాలని తెలిపారు. చిన్నారులకు డ్రాయింగ్ షీట్ మాత్రమే అందిస్తామని, మిగతా మెటీరియల్ మొత్తం చిత్రకారులే తమ వెంట తెచ్చుకోవాలని కోరారు.

ప్రతిభా పురస్కారాలు అందజేస్తున్న బ్యాంక్ సిబ్బంది

విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు

ప్రజాశక్తి - మంగళగిరి

విశాఖపట్నం కో-ఆపరేటివ్ బ్యాంక్ ఆధ్వర్యంలో ఈ విద్యా సంవత్సరంలో అత్యధిక మార్కులు సాధించిన బ్రాంచ్ పరిధిలోని విద్యార్థులకు మంగళగిరిలోని అరవింద స్కూల్ ప్రాంగణంలో గురువారం బ్యాంక్ డైరెక్టర్లు, కమిటీ మెంబర్ల ద్వారా ప్రతిభా పురస్కారాలు అందజేశారు. పదవ తరగతి లో 569 మార్కులు సాధించిన కుమారి తిరుమలశెట్టి గోమతి ప్రియ, 563 మార్కులు తెచ్చుకున్న నల్లబోయిన గాయత్రి ఇంటర్లో 902 మార్కులు, సాధించిన ఎం సాయి వీర హర్షిత టి వెంకట కిరణ 934, సుంకర అస్మిత 992 మార్కులు, సాధించారు. పదవ తరగతి విద్యార్థులు ఇద్దరికీ 10 వేల రూపాయలు ఇంటర్ విద్యార్థులు ముగ్గురికి 22,500 చెక్కులు అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న డైరెక్టర్లైన సివి రమణ రావు, చిన్నం కోటేశ్వరరావు, విజయవాడ జోన్ జోనల్ మేనేజర్ సిహెచ్ సుబ్రమణ్యం, మేనేజర్ రవిశంకర్ స్కూల్ ఇంచార్జ్ సత్య శేఖర్ విద్యార్థులు విద్యార్థులు తల్లిదండ్రులు బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

మంటలను అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

ఎసి వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి - మంగళగిరి : మంగళగిరి బైపాస్ రోడ్డు సమీపంలో గురువారం ఒక ఇంట్లో ఏసీలో మంటలు చెలరేగటంతో అగ్నిమాపక సిబ్బంది మంటలు ఆర్పివేశారు. అగ్నిమాపక సిబ్బంది తెలిపిన వివరాల మేరకు ఏసీ వాడుకునే ప్రతి ఒక్కరూ ఎప్పటికప్పుడు ఏసీ బాగోగులు చూసుకోవాలని తెలిపారు. అప్ అండ్ డౌన్ అయినప్పుడు ఇలా మంటలు చెలరేగుతాయని ఏసీ వాడే ప్రతి ఒక్కళ్ళు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఏసీకి మంటలు చెలరేగగానే ఆ మంటలు తలుపుల మీద పడటం వల్ల ఆస్తి నష్టం ఎక్కువగా జరిగిందని అగ్నిమాపక సిబ్బంది తెలిపారు.

మంగళగిరి తహశీల్దార్‌గా సుభాని

ప్రజాశక్తి - మంగళగిరి

మంగళగిరి నూతన తహసీల్దార్ గా గురువారం షేక్ మహబూబ్ సుభాని బాధ్యతలు స్వీకరించారు. గతంలో పెదనందిపాడు తహసీల్దార్ గా పని చేశారు. బదిలీపై మంగళగిరి వచ్చారు.

తహశీల్దార్‌కు పలువురు అభినందన

ప్రజాశక్తి-తెనాలి

ప్రజలకు పూర్తిస్థాయిలో అందుబాటులో ఉండి రెవెన్యూ సేవలను ప్రజలకు నిష్పక్షపాతంగా అందిస్తామని తహశీల్దార్ కె.వి గోపాలకృష్ణ చెప్పారు. తహశీల్దార్‌గా ఆయన గురువారం బాద్యతలు స్వీకరించారు. గోపాలకృష్ణ గతంలో బాపట్ల, చేబ్రోలు తహశీల్దార్‌గా పనిచేశారు. ఎన్నికల విధుల నిర్వహణకు సూళ్ళూరుపేటకు తహశీల్దార్‌గా బదిలీపై వెళ్ళిన అయన తాజాగా జిల్లా కలెక్టర్ ఉత్తర్వులతో తెనాలి తహశీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదప్రజల తహశీల్దార్‌గా పిలిపించుకోవాలన్నదే లక్ష్యమన్నారు. తెనాలి తన సొంత ప్రాంతంగా భావిస్తానన్నారు. సిబ్బందిపై ఎలాంటి అభియోగాలను ఉపేక్షించేదిలేదని స్పష్టం చేశారు. ప్రభుత్వ అంజండా ప్రకారం రెవెన్యూ సేవలను ప్రజలకు మరింత చేరువ చేస్తామన్నారు. బాధ్యతలు స్వీకరిం చేందుకు వచ్చిన తహశీల్దార్‌ను డిపూటి తహశీల్దార్ హెనిప్రియ, ఆర్ఐ వి.జాన్, సీనియర్ అసిస్టెంట్ చంద్రశేఖర్, ఎస్.జగన్మోహనరావు, మండల సర్వేయర్ స్వాగతించారు. కార్యక్రమంలో విఆర్వోలు, విఆర్ఏలు, అమృతలూరు మాజీ సర్పంచ్ కె.సతీష్, నల్లూరి ప్రదీప్, కొన్ని స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు ఆయనను అభినం దించారు.

సిఐడి అధికారిని అభినందించిన బిసి సంక్షేమ సంఘం నాయకులు

సిఐడి డిజి రవిశంకర్ అయ్యన్నార్‌కు అభినందన

ప్రజాశక్తి - మంగళగిరి

రాష్ట్రంలో అవినీతిరహిత-రక్షణాత్మక సమాజ నిర్మాణంలో, పోలీసు శాఖలోని సిఐడి విభాగనిదే కీలక పాత్రని, ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేసన శంకరరావు అన్నారు. గురువారం మంగళగిరి రాష్ట్ర డిజిపి కార్యాలయంలోని సిఐడి విభాగ డిజి రవిశంకర్ అయ్యన్నార్ ను వారి కార్యాలయంలో కేసన బీసీ నాయక బృందంతో కలిసి అభినందించి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో పోలీసు శాఖ పలు విభాగాలలో, వివిధ హోదాలలో, నీతి-నిజాయితీలతో పనిచేసి, ప్రజల మన్ననలు పొందిన ఐపిఎస్ అధికారిగా, వారు మంచి పేరు ప్రఖ్యాతులు గడించారన్నారు. నూతనంగా డీజీగా ఎంపికైన అయ్యన్నార్, నిష్పక్షపాత దర్యాప్తులతో అటు ప్రభుత్వ, ఇటు ప్రజల మన్ననలను పొందేలా కృషి చేయాలని శంకరరావు ఆకాంక్షించారు. కార్యక్రమంలో సంఘ జాతీయ ప్రధాన కార్యదర్శి మరియు రాష్ట్ర యువజన అధ్యక్షులు శ్రీ కుమ్మర క్రాంతి కుమార్, రాష్ట్ర యువజన కార్యనిర్వాహక అధ్యక్షులు శ్రీ ఉప్పాల రాజ్ కిరణ్, కందుల కృపాకరరావు చౌదరి పాల్గొన్నారు.

విద్యార్థులకు బ్యాగులు పంపిణీ చేస్తున్న టిడిపి నాయకులు కాట్రగడ్డ మధుసూదనరావు తదితరులు

విద్యార్థులకు పుస్తకాలు, దుస్తులు పంపిణీ

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్

ఎంటిఎంసీ పరిధిలోని వడ్డేశ్వరం జూనియర్ మహిళా కళాశాల, జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులు 54మందికి స్కూల్ బ్యాగులు, నోట్ బుక్స్, డ్రెస్సులు గురువారం గ్రామ తెలుగుదేశం నాయకులు అందజేశారు. ఈ సందర్భంగా టిడిపి సీనియర్ నాయకులు కాట్రగడ్డ మధుసూదన్ రావు మాట్లాడుతూ విద్యార్థులు తమ ఉజ్వల భవిష్యత్తు కోసం, ఉన్నత శిఖరాలు అధిరోహించడం కోసం చిన్నతనం నుండి కష్టపడి విద్యను అభ్యసించాలన్నారు. ఈ సంవత్సరం ఇంటర్ విద్యార్థులు మంచి మార్కులు సాధించి ఉత్తీర్ణులు అవ్వాలని ఆయన కోరారు. పరీక్షలలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు ప్రోత్సాహ నగదు బహుమతులు మొదటి స్థానంలో వారికి రూ.10వేలు, ద్వితీయ స్థానంలో ఉత్తీర్ణులైన వారికి రూ.5వేలు బహుమతి ఇవ్వనున్నట్లు ఆయన ప్రకటించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి సుబ్బారావు, ఉపాధ్యాయులు కాకుమాను జోజప్ప, టిడిపి గ్రామ అధ్యక్షులు ఈపూరి బాబు, టిడిపి గ్రామ ప్రధాన కార్యదర్శి మద్దినేని సుబ్రమణ్యం, తదితరులు పాల్గొన్నారు.

గుంపెన వెంకటేశ్వరరావుకు మాతృ వియోగం

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్

గుంపెన సామ్రాజ్యం (ఫైల్)

ఎంటిఎంసీ పరిధిలోని వడ్డేశ్వరం గ్రామానికి చెందిన సిపిఎం సీనియర్ నాయకులు గుంపెన వెంకటేశ్వరరావు తల్లి గుంపెన సామ్రాజ్యం (82) గురువారం ఉదయం అనారోగ్యంతో మృతి చెందారు. ఆమెకు ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు కాగా, ఆమె పెద్ద కుమారుడు గుంపెన వెంకటేశ్వరరావు వడ్డేశ్వరం గ్రామ సిపిఎం నాయకులుగా పనిచేస్తున్నారు. సామ్రాజ్యంల భౌతికకాయానికి సిపిఎం సీనియర్ నాయకులు జొన్న శివశంకరరావు, సిపిఎం తాడేపల్లి మండల కార్యదర్శి దొంతి రెడ్డి వెంకటరెడ్డి, టిడిపి సీనియర్ నాయకులు కాట్రగడ్డ మధుసూదనరావు, టిడిపి గ్రామ అధ్యక్షులు ఈపూరి బాబు, వైఎస్ఆర్సిపి సీనియర్ నాయకులు కత్తిక రాఘవరావు, కత్తిక మల్లికార్జునరావు తదితరులు నివాళులర్పించారు. ఆమె కుటుంబసభ్యులకు సానుభూతి తెలియజేశారు.

పరిశ్రమలకు స్థాపనకు అన్ని రకాలుగా సహకారం

ప్రజాశక్తి-గుంటూరు

మాట్లాడుతున్న అజిత

ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఫైనాన్షియల్ కార్పొరేషన్, జిల్లా పరిశ్రమల కేంద్రం సంయుక్త ఆధ్వర్యంలో గురువారం కలెక్టరేట్ ఎదుట ఉన్న పరిశ్రమల కేంద్రం సమావేశ మందిరంలో ఔత్సాహిక పారిశ్రామికవేత్తల సమావేశం నిర్వహించారు. ఎపి ఎస్ఎఫ్‌సి గుంటూరు బ్రాంచ్ మేనేజర్ కె.అజిత మాట్లాడుతూ పారిశ్రామిక అభివృద్ధిలో ఎపిఎస్ఎఫ్‌సి ముఖ్యపాత్ర పోషిస్తుందని, ముఖ్యంగా ప్రారంభ దశలో ఉన్న పారిశ్రామిక వేత్తలకు ఆర్థిక సహకారం అందించటానికి కృసి చేస్తుందన్నారు. ప్రాజెక్ట్ ధరలో దాదాపు 67 శాతం రుణం ఇస్తామన్నారు. ప్రాజెక్ట్‌ను బట్టి సబ్సిడీ కోసం తమవంతు సహకారం అందిస్తామని చెప్పారు. పరిశ్రమల కేంద్రం డిప్యూటీ డైరెక్టర్ సుధాకర్ మాట్లాడుతూ సింగిల్ విండో విధానంలో పరిశ్రమలకు అనుమతులు ఇస్తున్నట్లు చెప్పారు. కేంద్రం ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీ పథకాల గురించి, డిపిఆర్ తయారీ, పరిశ్రమకు కావాల్సిన భూమి, ఆర్థిక సహకారం వంటి వివిధ అంశాలపై ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు వివరించారు. కావున పరిశ్రమల స్థాపనకు ముందుకు రావాలని కోరారు.

గెలుపొందిన విద్యార్థులతో సెక్రెటరీ, ప్రిన్సిపాల్

స్కేటింగ్, తైక్వాండోలో కెఎల్‌పి విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక జెకెసి కాలేజి రోడ్డులోని డాక్టర్ కెఎల్‌పి పబ్లిక్ స్కూల్ విద్యార్థులు రాష్ట్ర, జాతీయ స్థాయి స్కేటింగ్ పోటీలలో విజయకేతనం ఎగురవేశారని పాఠశాల సెక్రెటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్ పేర్కొన్నారు. డెకాత్లాన్ గుంటూరు వారు నిర్వహించిన రాష్ట్ర స్థాయి స్కేటింగ్‌లో 9-11 సంవత్సరాల విభాగంలో అమర్‌నాథ్ చెరుకూరి వెండిపతకం, జి.లోకేష్ రజత పతకం సాధించారన్నారు. అలాగే గుంటూరులోని స్టెమ్ స్కూల్లో జరిగిన తైక్వాండో ఛాంపియన్‌షిప్ జిల్లా స్థాయి పోటీలలో సిహెచ్.పవన్ కళ్యాణ్ సబ్ జూనియర్ 32 కెజిల విభాగంలో బంగారు పతకం సాధించి, రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యాడని తెలిపారు. అదే విభాగంలో సిహెచ్.పూజిత వెండిపతకం, ఎన్.రేవంత్, ఎన్.వసంత్ రజత పతకాలు సాధించారని అన్నారు. ఈ సందర్భంగా ఆయా విద్యార్థులు సెక్రెటరీ కృష్ణప్రసాద్, ప్రిన్సిపాల్ జి.రత్తయ్య అభినందనలు తెలిపారు.

రోడ్డు భద్రతపై మలినేని విద్యార్థుల అవగాహన కార్యక్రమం

ప్రజాశక్తి-గుంటూరు

గుంతను పూడ్చుతున్న విద్యార్థినులు

మలినేని లక్ష్మయ్య ఉమెన్స్ ఇంజినీరింగ్ కాలేజి, ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో గురువారం రోడ్డు భద్రత, హెల్మెట్ వాడకంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు ఐదవ మైలు వద్ద ఒక పెద్ద గొయ్యి పూడ్చి వాహన దారులు రోడ్డు ప్రమాదాలకు గురి కాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్త లపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వట్టిచెరుకూరు పోలీసులు సిఐ ఉదయబాబు, పుల్లడిగుంట పంచాయతీ ఇంజినీరు, అలాగే కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జె.అప్పారావు పాల్గొన్నారు.

హెవీ మోటారు డ్రైవింగ్ శిక్షణకు దరఖాస్తులు స్వీకరణ

ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరు పార్లమెంటరీ నియోజకవర్గ పరిధిలోని లైట్ మోటార్ వెహికల్ లైసెన్స్ కలిగిన డ్రైవర్లకు ఆర్టీసి గుంటూరు-2 డిపో ఆధ్వర్యంలో హెవీ మోటార్ వెహికల్ డ్రైవింగ్ శిక్షణకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు డిపో మేనేజర్ యస్.కె.అబ్దుల్ సలాం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ డ్రైవింగ్ స్కూల్లో ఇప్పటి దాకా 15 బ్యాచ్‌లకు శిక్షణ ఇచ్చామని, 16వ బ్యాచ్ కోసం అడ్మిషన్లు ప్రారంభం అయ్యాయన్నారు.కావున ఆసక్తి ఉన్న వారు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. సీట్లు ఒక్కొక్క బ్యాచ్‌కి 16 మాత్రమే ఉంటాయని, ప్రతిరోజు గంటపాటు వాహనం వివిధ భాగాలు, వాటి పనితీరు గురించి, వివిధ రకాల రోడ్ల గురించి, రోడ్ల పైన ఉండే పెయింటింగ్ మార్కుల గురించి, రోడ్ల ప్రక్కన ఉండే సైన్ బోర్డులను గురించి, రోడ్ల ప్రక్కన ఉండే సిగ్నల్ బోర్డుల గురించి, సవివరంగా తెలియజేయటం జరుగుతుందన్నారు. అలాగే ప్రతిరోజు ప్రాక్టికల్‌గా ప్రతి ఒక్కరితో పదిహేను కిలోమీటర్లు బస్సును నడిపించటం జరుగుతుందన్నారు. ఘాట్ రోడ్డులో ఎటువంటి భయం లేకుండా నడపటానికి కొండవీడు ఘాట్ రోడ్డు, కోటప్పకొండ ఘాట్ రోడ్డులో బస్సు నడిపించటం జరుగుతుందన్నారు. శిక్షణ తర్వాత ఫారం -5, ఫారం5 ఎ సర్టిఫికెట్లు ఇస్తామని వాటి ద్వారా లైసెన్స్ కోసం దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఇతర వివరాలకు 88973 71003, 73828 94585 నంబర్లలో సంప్రదించాలన్నారు.

తల్లిపాలపై అవగాహన కల్పించాలి

ప్రజాశక్తి-గుంటూరు

తల్లిపాలు ప్రాధాన్యతపై ఆరోగ్య కార్యకర్తలు, అంగన్‌వాడీలు అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి తెలిపారు. గురువారం కలెక్టర్ ఛాంబర్‌లో తల్లిపాల వారోత్సవాల ప్రచార పోస్టర్, కరపత్రాలు, బ్యానర్లను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ మెటీరియల్‌ను ఈవారం రోజులపాటు తల్లిపాల ప్రాధాన్యతను ప్రతి ఒక్కరికీ తెలియజేయాల్సిన బాధ్యత, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు, అంగన్వాడీ కార్యకర్తలపై ఉందన్నారు. ముఖ్యంగా అంగన్వాడీ కేంద్రాలు, ఆరోగ్య కేంద్రాలు, ఆరోగ్య ఉపకేంద్రాలలో తల్లుల సమావేశములు ఏర్పాటు చేసి, గర్భిణీలు, బాలింతలకు ఈఅంశంపై పూర్తి అవగాహన కల్పించాలని తెలియజేసినారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్.కె.విజయలక్ష్మి, ఎన్‌సిడి ప్రాజెక్ట్ ఆఫీసర్ డాక్టర్ శ్రావణ్‌బాబు డిప్యూటీ డిఎంహెచ్ఒ అన్నపూర్ణ, డెమో ఏ.జయప్రసాద్, డిప్యూటీ డెమో ఎన్. వెంకటేశ్వర్లు, హెల్త్ సూపర్‌వైజర్ శాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి మంగళగిరి : మంగళగిరి గణపతి నగర్లోని ఇందిరానగర్ యూపీహెచ్సిలో ఒకటి నుంచి ఏడో తేదీ వరకు జరిగే తల్లిపాల వారోత్సవాలు గురువారం ప్రారంభమయ్యాయి. తొలుత హెల్త్ సెంటర్ లోని మీటింగ్ హాల్లో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పీ అనూష గర్భిణులు, బాలింతలకు తల్లిపాల విశిష్టత పై అవగాహన కల్పించారు. సమావేశంలో తల్లిపాల వారోత్సవాల పోస్టర్లు ఆవిష్కరించారు. అనంతరం తల్లిపాల విశిష్టతను తెలుపుతూ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎయిమ్స్ సీఎఫ్ఎం డిపార్ట్మెంట్ వైద్యులు డాక్టర్ కావ్య, డాక్టర్ అంకిత్, ఐసీడీఎస్ సూపర్వైజర్ రత్న కుమారి, హెల్త్ సూపర్వైజర్ జయలక్ష్మి పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్, అధికారులు

అన్నా క్యాంటిన్లను త్వరితగతిన సిద్ధం చేయాలి : కమిషనర్

ప్రజాశక్తి-గుంటూరు

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రతి పేదవానికి అల్పాహారం, భోజనం నామమాత్రపు ధరకే అందించేందుకే సంకల్పించి పునః ప్రారంభం చేయనున్న అన్నా క్యాంటీన్లను గుంటూరు నగరంలో ఈనెల 5 నాటికి పూర్తి స్థాయిలో సిద్దం చేయాలని నగర కమిషనర్ (ఎఫ్ఏసి) ఎస్.హరికృష్ణ ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. గురువారం నగరపాలక సంస్థ పరిధిలోని అన్న క్యాంటీన్లలో జరుగుతున్న మరమ్మతు పనులను కమిషనర్ ఇంజినీరింగ్ అధికారులతో కలిసి పరిశీలించి, పనుల వివరాలు, టెండర్‌పై ఎస్ఈని అడిగి తెలుసుకొని, పనులపై అధికారులకు తగు ఆదేశాలు జారీచేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అన్నా క్యాంటీన్లను ప్రతిష్టాత్మకంగా పునఃప్రారంభం చేయనున్నదని, జిఎంసి పరిధిలో చుట్టగుంట, మిర్చి యార్డ్, నల్లచెరువు, పల్నాడు బస్టాండ్, ఆర్‌టిఓ ఆఫీస్, ఐడి హాస్పిటల్, బస్టాండ్ ప్రాంతాల్లోని 7 అన్నా క్యాంటీన్లను ఈనెల 5వ తేదీకి వినియోగంలోకి తీసుకురావడానికి ఇంజినీరింగ్ అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. ప్రధానంగా పెయింటింగ్, విద్యుత్ వైరింగ్, ఫ్యాన్లు, స్విచ్‌బోర్డ్‌లు, లైట్లు, గ్లాస్‌డోర్లు, ఫ్లోర్ మరమత్తులను చేపట్టాలన్నారు. హ్యాండ్‌వాష్ పాయింట్స్, నీటి సౌకర్యం పక్కాగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు.సంప్‌లు, ఓవర్‌హెడ్ ట్యాంక్‌ల వివరాలు అడిగి తెలుసుకొని, ప్రతి క్యాంటీన్‌కు మోటార్ ఉండాలన్నారు. కాంపౌండ్ వాల్ కూడా ఉండేలా చూడాలని, క్యాంటీన్ పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా ప్రజారోగ్య అధికారులతో సమన్వయం చేసుకోవాలన్నారు. క్యాంటీన్ పరిసరాలలో పచ్చదనం పెంపునకు చర్యలు తీసుకోవాలని ఏడిహెచ్‌ని ఆదేశించారు. టెండర్ పొందిన కాంట్రాక్టర్లు నిబంధనలకు అనుగుణంగా, నాణ్యతా ప్రమాణాల్లో రాజీ లేకుండా నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలన్నారు. క్యాంటీన్లు ఉన్న ప్రాంతాల ఏఈలు పనులను వేగంగా జరిగేలా భాధ్యత తీసుకోవాలని ఆదేశించారు. పనుల పురోగతిపై డిఈఈలు, ఈఈలు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఆదేశించారు. పర్యటనలో ఎస్.ఈ. ఎం.శ్యాం సుందర్, ఈఈలు సుందర్రామి రెడ్డి, కోటేశ్వరరావు, శ్రీనివాస్, ఏడిహెచ్ రామారావు, డిఈఈలు రమేష్ బాబు, శ్రీధర్, హనీఫ్, సతీష్, ఏఈలు రాంబాబు, సునీల్ కుమార్, నాగవేణి, సాంబశివరావు, సచివాలయ ఎమినిటి కార్యదర్శులు పాల్గొన్నారు.

ఎమ్మెస్ విక్రంకు డాక్టరేట్ ప్రదానం

ప్రజాశక్తి - ఏఎన్‌యు : ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని సెంటర్ ఫర్ డాక్టర్ అంబేద్కర్ చైర్ విభాగంలో పరిశోధన చేసినందుకు ప్రముఖ సినీ నటులు ఎంఎస్. నారాయణ కుమారుడు ఎమ్మెస్ విక్రమ్ కు పీహెచ్డీ డిగ్రీని ప్రధానం చేసినట్లు రీసెర్చ్ అండ్ డెవలప్మెంట్ సెల్ కోఆర్డినేటర్ డాక్టర్ పి. సుధాకర్ తెలిపారు. ఏ స్టడీ ఆన్ చైల్డ్ లేబర్ ఇన్ రంగారెడ్డి డిస్ట్రిక్ట్ అనే అంశంపై విక్రమ్ పరిశోధన చేశారు. పరిశోధన పర్యవేక్షకులుగా అంబేద్కర్ చైర్ ప్రొఫెసర్ ఆచార్య వై .అశోక్ కుమార్ వ్యవహరించారు. విక్రమ్ హీరోగా, నటుడిగా క్యారెక్టర్ ఆర్టిస్టుగా నటిస్తూనే న్యాయ శాస్త్ర విభాగంలో పీజీ పూర్తి చేశారు. ప్రస్తుతం న్యాయవాద వత్తిలో ఉంటూనే తనకున్న నటన పట్ల ఆసక్తితో వెబ్ సిరీస్ లలో నటిస్తున్నారు.

సైన్స్ కళాశాల నూతన ప్రిన్సిపల్‌గా ప్రొఫెసర్ వీరయ్య

ప్రజాశక్తి - ఏఎన్‌యు : ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని సైన్స్ కళాశాల నూతన ప్రిన్సిపల్ గా జువాలజీ విభాగానికి చెందిన సీనియర్ ప్రొఫెసర్ ఆచార్య కె. వీరయ్య నియమితులయ్యారు. ఈ మేరకు ఇన్చార్జి వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ కంచర్ల గంగాధరరావు నియామక పత్రాలను గురువారం అందజేశారు. ఇప్పటివరకు విధులు నిర్వహించిన గంగాధరరావు వీసీగా నియమితులవడంతో వైస్ ప్రిన్సిపల్ వీరయ్య పదోన్నతి పొందారు. వీరయ్య స్థానంలో వైస్ ప్రిన్సిపల్‌గా ప్రస్తుతం ఓఎస్డిగా విధులు నిర్వ హిస్తున్న ఫిజిక్స్ విభాగానికి చెందిన ఆచార్య రవికుమార్ నియమితు ల య్యారు. వీరిని వీసి గంగాధర రావు, రెక్టార్ ప్రొఫెసర్ కె. రత్న షీలామణి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జి. సింహాచలం తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.

ఆరోగ్యశ్రీపై వైసిపి తప్పుడు ప్రచారం

ఎమ్మెల్యే గల్లా మాధవి

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

రాష్ట్రంలో ఆరోగ్యశ్రీని నిలిపివేస్తున్నట్టు వైసిపి నేతలు తప్పుడు ప్రచా రం చేస్తున్నారని గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు. గుంటూరులోని తన కార్యాలయంలో గురువారం ఆమె విలేకరులతో మాట్లాడారు. వైసిపి హయంలోనే ఎన్నో సార్లు బిల్లులు చెల్లించకపోవడం వల్ల ఆరోగ్యశ్రీని వైద్యులు నిలిపివేశారని గుర్తు చేశారు. వైసిపి అధికారం కోల్పోయే నాటికి ఈ ఏడాది జూన్ వరకు రూ.1700 కోట్ల బకాయిలు వున్నట్టు నెట్ వర్కు ఆస్పత్రుల నిర్వహాకులు ఇప్పటికే వెల్లడించారన్నారు. మాజీ మంత్రి విడదల రజని మూడు నెలలు కన్పించకుండా పోయి ఇప్పుడే నిద్ర లేచినట్టు బయటకు వచ్చి రాష్ట్ర ప్రభుత్వంపై విమర్శలు చేయడం తగదన్నారు. కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి భారీ కేటాయింపులు తేవడంతో సిఎం చంద్రబాబు ఎంతో కృషి చేశారని ఇందులో భాగంగా అమరావతికి రూ.15 వేల కోట్లు నిధులు వచ్చా యన్నారు.

తామూ వైసిపి బాధితులమే : రెండేళ్ల క్రితం గుంటూరులో తాము ఒక ఆస్పత్రి ప్రారంభిస్తే కార్పొరేషన్ అధికారులు తమ వద్ద ట్రేడ్ లైసెన్స్‌కు రూ.50వేలు కట్టించుకోగా అధికారులు, ప్రజా ప్రతినిధులు రూ15లక్షలు వసూలు చేశారని, తాము వారి బాధితులమేనని వెల్లడించారు. కార్పొరేషన్‌కు రావాల్సిన ఆదాయం ప్రభుత్వ ఖజానాకు జమకాకుండా అధికారులు, వైసిపి నేతల జేబుల్లోకి వెళ్తున్న విషయం తమకు తెలుసునన్నారు. త్వరలో వీరిపై చర్యలు ఉంటాయన్నారు. గుంటూరు సామాజిక ఫించన్ల పంపిణీలో అక్రమార్కులను తొలగించేందుకు చర్యలు తీసుకుంటా మన్నారు.

మొదటి నెల జీతం విరాళంగా ఇస్తున్నా : శాసన సభ్యురాలుగా మొదటి నెల జీతం గా 1,75,000లను అందుకున్నానని ఈ సొమ్మును వివిధ తరగతుల వారికి విరాళంగా ఇస్తున్నానని గల్లా మాధవి తెలిపారు. అన్న క్యాంటిన్లకు రూ.25 వేలు, పేదలకు దుప్పట్ల పంపిణీకి రూ.10 వేలు, సచివాలయాల పరిధిలో వెయ్యి మొక్కలు నాటేందుకు రూ.10 వేలు, తిరుపతి వేంకటేశ్వర స్వామి హుండీకి రూ.20వేలు, కూటమి పార్టీల్లో పేద కార్యకర్తలు 10 వేలమందికి రూ.50 వేలు, పేద ప్రజలకు పిల్లల చదువులకు రూ.50 వేలు ఇస్తున్నట్టు తెలిపారు. విలేకరుల సమావేశంలో పార్టీ నియోజకవర్గం పరిశీలకులకు సింహాద్రీ కనకాచారి పాల్గొన్నారు.

మీడియా సమావేశంలో మాట్లాడుతున్న గల్లా మాధవి